RNI No. TELTEL . 12/48343

# మహానది

MAHANADI TELUGU DAILY

Website: www.mahanadi.net

రంగారెడ్డి | సంపుటి : 4 | సంచిక : 234 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | గురువారం | నవంబర్ | 13 | 2025 పేజీలు : 8 | వెల : రూ.2.00

## ఢిల్లీ పేలుడు నిందితులతో మాకు సంబంధం లేదు : అల్ ఫలా యూనివర్సిటీ




న్యూఢిల్లీ,నవంబర్,12:ఢిల్లీ లోని ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి జరిగిన పేలుడుకు సంబంధించిన కేసులో అరెస్టైన నిందితులతో తమకు ఎలాంటి సంబంధం లేదని.. హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్ లోని అల్ ఫలా యూనివర్సిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. పేలుడు ఘటన తమను కలిచివేసిందని, ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొంది. యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ భూపిందర్ కౌర్ ఆనంద్ పేరిట ప్రకటన విడుదల చేశారు. తాము 1997 నుంచి వివిధ విద్యాసంస్థలు నడుపుతున్నామని, హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్ అయిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తింపు పొందామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### మరోసారి వాయిదా పడిన తెలంగాణ

# కేబినెట్ సమావేశం

- తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా.. జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత భేటీ
- ఈరోజు జరగాల్సిన భేటీ ఈ నెల 15వ తేదీకి మార్పు
- రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరగనున్న సమావేశం

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈరోజు జరగాల్సి ఉన్న ఈ భేటీని ఈ నెల 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలపై ప్రభుత్వం ఒక స్పష్టమైన నిర్ణయానికి రానుంది. ఈ సమావేశానికి మంత్రులతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరుకానున్నారు.వాస్తవానికి ఈ కేబినెట్ సమావేశం తొలుత నవంబర్ 7వ తేదీన జరగాల్సి ఉండగా, దానిని 12వ తేదీకి మార్చారు. ఇప్పుడు తాజాగా మరోసారి వాయిదా వేసి 15వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక




ఫలితం వెలువడిన మరుసటి రోజే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భేటీ తేదీని మార్చినట్లు సమాచారం.


### 200 ఐఈడీ బాంబులతో

# దేశవ్యాప్తంగా పేలుళ్లు

- ఢిల్లీ ఎర్రకోట పేలుడు కేసులో సంచలన విషయాలు
- 26/11 తరహాలో భారీ దాడులకు ఉగ్రవాదుల కుట్ర
- 200 శక్తిమంతమైన ఐఈడీ బాంబులు సిద్ధం చేసేందుకు ప్లాన్



దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటన దర్యాప్తులో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఇది కేవలం ఒక్క చోటుకే పరిమితమైన దాడి కాదని, 26/11 ముంబయి తరహాలో దేశవ్యాప్తంగా వరుస పేలుళ్లతో విధ్వంసం సృష్టించేందుకు ఉగ్రవాదులు భారీ కుట్ర పన్నినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం అత్యంత శక్తిమంతమైన 200 ఐఈడీ (ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్) బాంబులను సిద్ధం చేసే పనిలో ఉగ్రవాదులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఉగ్రవాదుల టార్గెట్ లిస్టులో ఎర్రకోటతో పాటు ఇండియా గేట్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్, గౌరీశంకర్ ఆలయం వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి.వీటితో పాటు దేశవ్యాప్తంగా పలు రైల్వేస్టేషన్లు, రద్దీగా ఉండే షాపింగ్ మాల్స్‌లోనూ విధ్వంసం సృష్టించాలని పథకం రచించారు. జనవరి నుంచే ఈ కుట్రకు ప్రణాళికలు జరుగుతున్నట్లు విచారణలో వెల్లడైంది.



### హైదరాబాద్‌లో కొనసాగుతున్న

# తనిఖీలు

- మూడు కమిషనరేట్ల పరిధిలో కొనసాగుతున్న హైఅలర్ట్
- డాగ్ స్క్వాడ్ బాంబు స్క్వాడ్ బృందాలతో తనిఖీలు
- ఎక్కడ ఉగ్రకుట్రలు భగ్నమైనా హైదరాబాద్‌లో వెలుగుచూస్తున్న మూలాలు

న్యూఢిల్లీ,నవంబర్12,

దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో రెండు రోజుల క్రితం కారు బాంబు పేలుడు సంభవించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో హైఅలర్ట్ కొనసాగుతోంది. నగరంలోని మూడు కమిషనరేట్ల (హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ) పరిధిలో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాయి.



### దువ్వాడ మీదుగా వెళ్లే పలు రైళ్లు

# 20న రద్దు

- నాలుగు ఎక్స్ ప్రెస్ రైళ్లను క్యాన్సిల్ చేసినట్లు వివరణ
- పయాణికులు గమనించాలని ప్రకటన జారీ

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ%-% దువ్వాడ సెక్షన్ మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 20న నాలుగు ఎక్స్ ప్రెస్ రైళ్లను క్యాన్సిల్ చేసినట్లు తెలిపింది. విజయవాడ - దువ్వాడ సెక్షన్‌లో రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నాయని వివరించింది.

### యువత.. సరికొత్త ఆలోచనలతో

# ముందుకు రావాలి

- న్నతస్థానానికి చేరుకోవాలనే లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా కష్టపడాలి
- చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కొత్త విధానం తెచ్చాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



హైదరాబాద్,నవంబర్12,

యువత.. సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొని ప్రసంగించారు. సాహసాలు చేసినప్పుడే విజయం దక్కుతోందని సూచించారు. ఉన్నతస్థానానికి చేరుకోవాలనే లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా కష్టపడాలని శ్రీధర్ బాబు వెల్లడించారు.చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కొత్త విధానం తెచ్చామని పేర్కొన్నారు. అంకుర పరిశ్రమలు రూ. వంద కోట్ల టర్నోవర్ కు చేరుకోవాలన్నారు.స్టార్టప్ లకు సాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సూచించారు. ఇవాళ ప్రపంచమంతా మనవైపు చూస్తోందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే వారికే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఇతర దేశాల్లోని అవకాశాలు కోసం చూడొద్దని మంత్రి కోరారు. ఇతర దేశాలు మనపై ఆధారపడే స్థితికి మనం ఎదగాలని ఆయన సూచించారు.

# గుంటూరులో ఉద్రిక్తత..

## పోలీసులతో అంబటి రాంబాబు వాగ్వాదం

- గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు ర్యాలీకి అడ్డంకి
- అంబటి, పట్టాభిపురం సీఐ మధ్య తీవ్ర వాగ్వాదం
- సీఐ తీరుపై మండిపడిన అంబటి.. లోకేశ్ బంధువంటూ ఆరోపణ
- ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- ప్రైవేటీకరణ ఆపే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం



ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తున్నారంటూ వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా గుంటూరులో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలో తలపెట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో ఆయనకు, స్థానిక సీఐకి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసుల తీరును నిరసిస్తూ వైసీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. వైసీపీ ఇచ్చిన పిలుపు మేరకు, బుధవారం నాడు అంబటి రాంబాబు గుంటూరులోని తన నివాసం నుంచి ర్యాలీ ప్రారంభించారు. స్వామి థియేటర్ వద్దకు చేరుకోగానే, పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ర్యాలీని నిలువరించారు. ఈ క్రమంలో అంబటి రాంబాబుకు, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుకు మధ్య మాటామాటా పెరిగింది. సీఐ తనతో దురుసుగా ప్రవర్తిస్తూ, వేలు చూపిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారని అంబటి ఆరోపించారు.

# ఇదేనా బంగారు తెలంగాణ?

## రెండు ప్రభుత్వాల పాలనలో మార్పు లేదు: కవిత



గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో రాష్ట్రంలోని సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. రెండు ప్రభుత్వాల హయాంలోనూ ప్రజల కష్టాలు తీరలేదని, ఇదేనా బంగారు తెలంగాణ అని ఆమె ప్రశ్నించారు. బుధవారం నల్గొండలో పర్యటించిన ఆమె, జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అనంతరం మీడియాతో మాట్లాడారు. నల్గొండ జిల్లాకు గత 12 ఏళ్లుగా కృష్ణా జలాలు పూర్తి స్థాయిలో అందాయో లేదో ఆలోచించుకోవాలని కవిత అన్నారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే కాంట్రాక్టర్‌ను ఒక్క మాట కూడా అనలేని దుస్థితి నెలకొందని విమర్శించారు.

### డీజీపీకి కేటీఆర్

# క్షమాపణ చెప్పాలి

- పోలీసు అధికారుల సంఘం డిమాండ్
- డీజీపీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్న పోలీసు అధికారుల సంఘం
- పోలీసు శాఖ నిష్పక్షపాతంగా పని చేస్తోందని వెల్లడి



హైదరాబాద్,నవంబర్12,

తెలంగాణ రాష్ట్ర డీజీపీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ఖండించింది. డీజీపీ శివధర్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని సంఘం పేర్కొంది. గతంలో ఎన్నడూ లేనంత అప్రమత్తతతో పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని తెలిపింది.

# 22న రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి మహిళా కళాశాల స్నాతకోత్సవం




హైదరాబాద్, మహానది న్యూస్,నవంబర్ 12: మహిళా విద్యను ప్రోత్సహించేందుకు రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి హైదరాబాద్ మహిళా విద్యా సంఘంను స్థాపించారు. ఆ సంఘం ద్వారా ప్రస్తుతం మాడపాటి హనుమంతరావు హైస్కూల్, రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల, ఫార్మసీ కళాశాలలు కొనసాగుతున్నాయి. 1954లో అప్పటి ప్రధానమంత్రి పండిత్ జవహార్ లాల్ నెహ్రూ రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
1955లో భారత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కళాశాల భవనాన్ని ప్రారంభించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ హాల్ ను 1959లో అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ప్రారంభించారు. 1965లో అప్పటి కేంద్రమంత్రి ఇందిరాగాంధి కళాశాల ప్రాంగణలో ఏర్పాటు చేసిన కొండా వెంకట రంగారెడ్డి విద్యార్థినుల హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. 2005లో జరిగిన కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలకు అప్పటి భారత రాష్ట్రపతి ఏపిజే అబ్దుల్ కలాం హాజరై విద్యార్థినులను ప్రోత్సహించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు లక్షలాది మంది విద్యార్థినీలకు ఉన్నత విద్యను అందిస్తూ జాతీయ స్థాయిలో 150 నుంచి 300మధ్యలో ర్యాంకుల్లో కొనసాగుతూ కళాశాల అదర్శవంతంగా నిలుస్తోంది. రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 14వ స్నాతకోత్సవ వేడుకలను ఈ నెల 22వ తేదీన శనివారం నారాయణగూడ లోని కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జె. అచ్యుత దేవి తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొపెసర్ కట్టా ముత్యంరెడ్డి, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ జి. సుదర్శన్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.వాణి మాధవిలతో కలిసి ఆమె స్నాతకోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. 2023, 2024 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలను ప్రధానం చేయనున్నట్లు వారు తెలిపారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేసి ప్రోత్సహించనున్నట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థుల డిగ్రీల ప్రధానోత్సవ వేడుకలకు ముఖ్యఅతిధిగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ హరిచందన దాసరి




ఐఏఎస్, ఉస్మానియా విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.శశికాంత్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె. సింధూరి, కన్వీనర్ డాక్టర్ ఎం. సుచిత్ర, కో కన్వీనర్ డాక్టర్ కె.స్వప్న తదితరులు పాల్గొన్నారు.


# బీసీ రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించాలి



కాచిగూడ, మహానది న్యూస్,నవంబర్ 12: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పార్టీ పరంగా కాకుండా చట్టబద్ధంగా కల్పించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ మొదటి వారంలో జరిగే పార్లమెంట్ సీతాకాల సమావేశాల్లో బీసీ బిల్లును ఆమోదించి రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్ లో చేర్చాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బీసీలను పూర్తిగా విస్మరిస్తున్నాయని, దీంతో బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.
రిజర్వేషన్ల సాధన కోసం బీసీలందరూ పార్టీలకతీతంగా సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీల పట్ల సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే 42 శాతం రిజర్వేషన్ల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదిని అఖిల పక్షంతో కలిసి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నేతలు భూషణ్ భాస్కర్, పి. కృష్ణ, ముత్యాల్ రావు, డాక్టర్ ప్రశాంత్ నిమ్ కర్, సత్యపాల్ సింగ్, ప్రదీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈఎంఐ కట్టలేదా? ఇక మీ ఫోన్ లాక్..

## కొత్త నిబంధనలకు ఆర్బీఐ కసరత్తు!



- లోన్ కట్టకపోతే ఫోన్లు లాక్ చేసేందుకు ఆర్బీఐ సన్నాహాలు
- చిన్న రుణాల రికవరీ కోసం కొత్త మార్గదర్శకాలు
- గతంలో నిలిపేసిన విధానానికి మళ్లీ పచ్చజెండా
- వినియోగదారుడి అనుమతి తప్పనిసరి, డేటాకు రక్షణ
- బజాజ్ ఫైనాన్స్ వంటి సంస్థలకు ప్రయోజనం

ఈఎంఐపై మొబైల్ ఫోన్ కొనుగోలు చేసిన వారు బకాయిలు చెల్లించడంలో విఫలమైతే, వారి ఫోన్లను దూరం నుంచే లాక్ చేసేందుకు రుణ సంస్థలకు అనుమతి ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) యోచిస్తోంది. మొండి బకాయిలను తగ్గించే లక్ష్యంతో ఈ మేరకు కొత్త మార్గదర్శకాలను సిద్ధం చేస్తున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దేశంలో చిన్న మొత్తాల రుణాల ఎగవేతలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు ఆర్బీఐ ఈ చర్యలు చేపడుతోంది. గతంలో కొన్ని ఫైనాన్స్ కంపెనీలు అనుసరించిన ఈ విధానాన్ని ఆర్బీఐ గతేడాది నిలిపివేసింది. అయితే, ఇప్పుడు రుణ సంస్థలతో సంప్రదింపులు జరిపి, పటిష్ఠమైన నిబంధనలతో కూడిన మార్గదర్శకాలను తన 'ఫెయిర్ ప్రాక్టీసెస్ కోడ్'లో చేర్చనుంది. రాబోయే కొద్ది నెలల్లోనే ఈ కొత్త నిబంధనలు వెలువడే అవకాశం ఉంది. ఈ కొత్త నిబంధనల ప్రకారం, రుణం ఇచ్చే సమయంలోనే ఫోన్‌ను లాక్ చేసే అవకాశంపై వినియోగదారుడి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి. అలాగే, ఫోన్‌ను లాక్ చేసినప్పటికీ, అందులోని వ్యక్తిగత డేటాను యాక్సెస్ చేసే అధికారం రుణ సంస్థలకు ఉండదు. "వినియోగదారుల డేటాకు రక్షణ కల్పిస్తూనే, రుణాల రికవరీకి వీలు కల్పించడమే తమ ఉద్దేశం" అని ఒక అధికారి తెలిపారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే బజాజ్ ఫైనాన్స్, డీఎంఐ ఫైనాన్స్, చోళమండలం ఫైనాన్స్ వంటి సంస్థలకు ప్రయోజనం చేకూరుతుంది. ముఖ్యంగా రూ. లక్షలోపు రుణాల్లో ఎగవేతలు ఎక్కువగా ఉన్నాయని, ఈ విధానం ద్వారా రికవరీలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. 2024 నాటి ఒక అధ్యయనం ప్రకారం, దేశంలో అమ్ముడయ్యే ఎలక్ట్రానిక్ వస్తువుల్లో మూడింట ఒక వంతు చిన్న రుణాల ద్వారానే జరుగుతున్నాయి. అయితే, ఈ విధానంపై వినియోగదారుల హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనివల్ల లక్షలాది మంది వినియోగదారులను రుణ సంస్థలు ఇబ్బందులకు గురిచేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నాయి. "ఈ విధానం అత్యవసరమైన టెక్నాలజీని ఒక ఆయుధంగా మారుస్తుంది. రుణం తిరిగి చెల్లించే వరకు ప్రజల జీవనోపాధి, విద్య, ఆర్థిక సేవలకు దూరం చేస్తుంది" అని క్యాష్‌లెస్ కన్స్యూమర్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ ఎల్. ఆరోపించారు.

# చిగురుమామిడి మండలంలో నిండిన కుంటలు, చెరువులు..

చిగురుమామిడి : చిగురుమామిడి మండలంలో గురువారం రాత్రి కోసిన భారీ వర్షానికి కుంటలు, చెరువులు నిండాయి. పలు గ్రామా లకు రాకపోకలు అంతరాయం ఏర్పడింది. పలు ఇళ్లలోకి, పాఠశాలకు, దేవాలయాల్లో నీరు చేరాయి. ఇందుర్తి ఎల్లమ్మ వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఇందుర్తి నుండి కోహెడ వెళ్లే ప్రధాన రహదారి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.అటువైపుగా వెళ్లకుండా అధికారులు కంచ ఏర్పాటు చేశారు. ఓగులాపూర్ నుండి మండల కేంద్రానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రేకొండ నుండి మొగిలిపాలెం వెళ్లే రహదారి కల్వర్టు వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో శుక్రవారం రాకపోతే నిలిచిపోయాయి. గాగిరెడ్డిపల్లి లోని బోల్లోని పల్లెలో కెనాల్ కాలువ తెగి ఊరిలోకి నీరు రావడంతో ఇళ్లలో నీళ్లు చేరాయి. సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలోకి వరద నీరు చేరడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు.ఇందుర్తి ప్రభుత్వ పాఠశాలలో నీరు చేరడంతో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో మధుసూదన్, ఎంపిఓ రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. రామంచలోని దేవుని చెరువు, కొత్త కుంట, నాగుల చెరువు, అమ్మ చెరువుల నుండి మత్తడి పడడంతో ఊరు చివర ఇండ్ల పక్కన ఉన్న దర్గా నుండి ఉధృతంగా వరద నీరు ప్రవహించింది. పలు పంటలు నీట మునిగాయి. మధ్య ఎల్లమ్మ వాగు గురువారం రాత్రి నుండి ఉధృతం కావడంతో సమాచారం తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎస్సై సాయికృష్ణ తోపాటు మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్, స్థానిక మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అందే సురేష్‌పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. దీంతోమంత్రి ఆదేశా లకు రాత్రి వాగు వద్దకు చేరుకొని కంచెను ఏర్పాటు చేశారు.

# బాల్య వివాహాలు జరగకుండా చూడాలి

**- బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి : డిడబ్ల్యుఓ హేమభార్గవి**
**- బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు**

నర్సాపూర్,మహానది న్యూస్, నవంబర్ 12: బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని డి డబ్ల్యూఓ హేమభార్గవి అన్నారు.బుధవారం నర్సాపూర్ పట్టణంలోని రైతు వేదికలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన, పిల్లలు అభివృద్ధిపై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిడబ్ల్యూ ఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా గ్రామాలు, తండాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు, బాల్య వివాహాలు జరిగితే అంగన్వాడీ, ఆశా, పంచాయతీ కార్యదర్శులదే బాధ్యతని హెచ్చరించారు. మెదక్ జిల్లాను బాల్యవివాహాలు జరగని జిల్లాగా మార్చాలని తెలిపారు. పిల్లలందరూ బడిలో ఉండాలన్నారు. పిల్లల చేత పని చేయించడం నేరమని తెలిపారు. కిశోర బాలికలకు సంబంధించిన వివరాలు అంగన్వాడి టీచర్ ల వద్ద ఉండాలన్నారు. కిషోర్ బాలికలు ఎక్కడ చదువుతున్నారు, ఏం చదువుతున్నారు, ఏం చేస్తున్నారు అన్న విషయం తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. గ్రామ సంఘాల ద్వారా ప్రతి ఇంటిలో తల్లి తండ్రులకి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం నర్సాపూర్ ఎంపీడీవో మధులత మాట్లాడుతూ, గ్రామాలలో, తండాల్లో బాల్య వివాహాల నిర్మలనకు అన్ని



శాఖల అధికారులు సహకరించాలని తెలిపారు. చట్టాలపై అవగాహన గ్రామ స్థాయిలో **VCPC** ద్వారా అవగాహన కల్పించాలని , ప్రతి పాఠశాలలో అవగాహన కల్పించడం అవసరమని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి, ఐసిడిఎస్ మండల సూపర్వైజర్లు సరళ, కవిత, లక్ష్మి నర్సమ్మ, మెడికల్ ఆఫీసర్. అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శిలు , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# ఇజ్రాయిల్‌తో సంబంధాలొద్దు

## ప్రపంచ దేశాలకు 140మంది ప్రముఖ ఆర్థికవేత్తల లేఖ



న్యూఢిల్లీ: ఇజ్రాయిల్ గాజాలో 'ఆకలిని ఆయుధంగా' వినియోగించడాన్ని ఖండిస్తూ 140మంది ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక వేత్తలు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆకలిని తీవ్రతరం చేసే ఏ విధానాన్ని అయినా' తక్షణమే నిలిపివేయాలని అంతర్జాతీయ సమాజాన్ని, అమెరికా ప్రభుత్వాన్ని వారు కోరారు. ఇజ్రాయిల్‌తో ఆర్థిక,సాంస్కృతిక, క్రీడా సంబంధాలను బహిష్కరించాలంటూ ప్రపంచ దేశాలను కోరారు. ఈ మేరకు ప్రముఖ ప్రొఫెసర్లు, పరిశోధకులు మరియు ఇతర విద్యావేత్తలు సహా 140మంది ఆర్థిక వేత్తలు బుధవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనపై సంతకాలు చేశారు. "ఆక్రమణలు, మారణ హెూమానికి నిధులు సమకూర్చే ఆర్థిక వ్యవస్థ" నుండి వైదొలగాలని వారు పిలుపునిచ్చారు. గత రెండేళ్లుగా ప్రజల జీవితాలను, సమాజాన్ని, పాలస్తీనా భవిష్యత్తును తీవ్రంగా నాశనం చేసినందుకు ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయాలని అంతర్జాతీయ సమాజం, అమెరికా ప్రభుత్వాన్ని వారు ఆ ప్రకటనలో కోరారు. ఇదే విషయమై 23మంది ప్రముఖ ఆర్థిక వేత్తలు ఇటీవల ఇజ్రాయిల్ ప్రధానికి, నెసెట్‌కు లేఖ రాసిన సంగతి తెలిసిందే. గాజాలో శాశ్వతంగా కరువు నెలకొనేలా,
అక్కడి ప్రజలను స్థానభ్రంశులను చేసే చర్యలను ఇజ్రాయిల్ కొనసాగిస్తోందని ఆ లేఖ పేర్కొంది. యుద్ధాన్ని తక్షణమే ముగించడమే ప్రస్తుతం అవసరమైన చర్య అని, అదే తర్వాతి చర్యలకు నాందీ ప్రస్తావన అవుతుందని ఆర్థికవేత్తలు స్పష్టం చేశారు. గాజాలో యుద్ధాన్ని ఆపాలంటూ తమ తమ దేశాల్లోని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని, ఆ మేరకు డిమాండ్లు చేయాలని వారు పలువురు నేతలను, ఆర్థిక సంస్థలను కోరారు.

# విమానాలకు ఎయిర్ బ్యాగ్స్



**ప్రమాదాల నుంచి రక్షణకు సరికొత్త సాంకేతికత**
**ఇంజిన్ ఫెయిలైతే తక్షణం గుర్తించనున్న ఏఐ**
**ఆ వెంటనే తెరుచుకోనున్న ఎయిర్ బ్యాగ్స్**
**ప్రయాణికులు ప్రాణాలతో బయటపడే అవకాశం**

న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో పెరుగుతున్న విమాన ప్రమాదాలు ప్రయాణికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దుర్ఘటన తర్వాత విమాన ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గినట్టు పలు సర్వేల్లో తేలింది. ఈ నేపథ్యంలో విమాన ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించడానికి శాస్త్రవేత్తలు సరికొత్త సాంకేతికతను అభివృద్ధి చేశారు. ప్రమాదం జరిగినప్పుడు కార్లలో ఎయిర్‌బ్యాగులు తెరుచుకున్నట్టుగానే, విమానాలకు కూడా ఎయిర్‌బ్యాగ్‌లతో రక్షణ కల్పించే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇంజినీర్లు ఎషెల్ వాసిమ్, దర్శన్ శ్రీనివాసన్ అభివృద్ధి చేశారు. వీరు బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, పిలానీకి చెందిన దుబాయ్ క్యాంపస్‌కు చెందినవారు. 'ప్రాజెక్ట్ రీబర్త్' పేరుతో వీరు దీనిని రూపొందించారు. ప్రతిష్ఠాత్మక జేమ్స్ డైసన్ అవార్డ్ కోసం పోటీలో ఫైనల్స్‌కు చేరినవాటిలో ఈ ప్రాజెక్టు కూడా ఉంది. జేమ్స్ డైసన్ అవార్డ్ వెబ్‌సైట్‌లో ఈ 'ప్రాజెక్ట్ రీబర్త్' మొదటి ఏఐ పవర్డ్ క్రాష్ సర్వైవల్ సిస్టమ్ అని పేర్కొన్నారు. జూన్ 12న అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిపోవడంతో గుండె పగిలిందని, ఆ క్షణాలు తమకు ప్రేరణగా నిలిచి, దీనిని అభివృద్ధి చేశామని ఇంజినీర్లు తెలిపారు.
ఏఐ వ్యవస్థతో పర్యవేక్షణ: 'ప్రాజెక్ట్ రీబర్త్'లోని ఏఐ సిస్టమ్ విమానం ఎగురుతున్న ఎత్తు, వేగం, ఇంజిన్ పరిస్థితి, దిశ, అగ్నిప్రమాదం, పైలట్ స్పందన వంటివాటిని పర్యవేక్షిస్తుంది. రాబోతున్న అత్యవసర పరిస్థితి గుర్తించి సమాచారం తెలుసుకుని సత్వర నిర్ణయం తీసుకోగలుగుతుంది. విమానం 3,000 అడుగుల కన్నా తక్కువ ఎత్తులో ఉండి, కూలిపోవడం అనివార్యమైనపుడు, ఈ వ్యవస్థ తనంతట తానే పని ప్రారంభిస్తుంది. ఈ దశలో కూడా పైలట్ తన ఆదేశాలను అమలు చేయవచ్చు. హైస్పీడ్ ఎయిర్‌బ్యాగ్స్ హుటాహుటిన విమానం ముందు భాగం, మధ్య భాగం, తోక భాగాల్లో రెండు సెకండ్లలోపలే తెరుచుకుంటాయి. విమానం నేలను తాకేటపుడు ఈ బ్యాగులు విమానాన్ని పట్టుపురుగు గూడు మాదిరిగా చుట్టుకుని రక్షణ కవచంగా మారుతాయి.

# స్వస్థలాకు సేఫ్ గా ఆంధ్రులు..

విజయవాడ: ఏపీ మంత్రి నారా లోకేష్ కృషి ఫలించింది. ఆయన చొరవతో నేపాల్ నుంచి ఏపీ వాసులు క్షేమంగా చేరుకున్నారు. నేపాల్ లో ఆందోళనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. హింసతో నేపాల్ అట్టుడుకి పోతోంది. ఈ నేపథ్యంలో నేపాల్ వెళ్లిన తెలుగు ప్రజల భద్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అయ్యింది. నేపాల్ వెళ్లిన బాధిత కుటుంబాలు ఆందోళనతో ఉన్నాయి. ఈ తరుణంలో నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని రక్షించేందుకు మంత్రి నారా లోకేష్ రంగంలోకి దిగారు. ఢిల్లీలో ఏపీ భవన్‌తో పాటు నేపాల్ లో ఉన్న భారత రాయబార కార్యాలయంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకున్నారు. నేరుగా బాధితులతో వీడియో కాల్ లో మాట్లాడుతూ తగు జాగ్రత్తలు సూచించారు.
అక్కడ నుంచి స్వస్థలాలకు క్షేమంగా బయలుదేరేలా ఏర్పాట్లు చేయడంలో నరాల్లోకే సక్సెస్ అయ్యారు.కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్న క్రమంలో 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' పేరుతో అనంతపురంలో కూటమి ప్రభుత్వం విజయోత్సవ సభ నిర్వహించింది. అయితే ఆ సభకు మంత్రి నారా లోకేష్ వెళ్లలేదు. సచివాలయంలో ఏర్పాటు చేసిన వార్ రూమ్ నుంచి సహాయక చర్యలను పర్యవేక్షించారు.ఈచర్యలు ఫలించి నేపాల్ లో చిక్కుకున్న తెలుగు ప్రజలు స్వదేశానికి పయనం అవుతున్నారు. నేపాల్ లో 12 ప్రాంతాల్లో 217 మంది ఏపీ వాసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిని ఏపీకి రప్పించేందుకు చర్యలు ప్రారంభించారు. తొలివిడతగా నేపాల్ లోని హెటౌడా నుంచి 22 మంది ఏపీ వాసులను సురక్షితంగా బీహార్ సరిహద్దు ప్రాంతాలకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి ఏపీకి రప్పించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తమను క్షేమంగా తీసుకురావడంపై ఏపీ ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.వ ఒరోవైపు ఖాట్మండు పరిసరాల్లో ఉన్న 173 మందిని తరలించేందుకు గురువారం ఉదయం10 గంటలకు ప్రత్యేక విమానం ఢిల్లీనుంచి నేపాల్ వెళ్లింది. అక్కడ కర్ఫ్యూ సడలించిన వెంటనే ఏపీకి బయలుదేరనుంది.మిగతా 173 మందిని విశాఖ,వారికి ధైర్యం చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి క్షేమంగా తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

# సంపాదకీయం

## స్వదేశీ ప్రచారం

శక్తివంతమైన, అభివృద్ధి చెందిన భారత్‌కు.. స్వయంసమృద్ధి చెందిన భారతదేశమే పునాది. రక్షణ, సాంకేతికత, ఇంధన, అంతరిక్షంతో పాటు తయారీ రంగాల్లో పురోగతి 2047 నాటికి మనల్ని అభివృద్ధి చెందిన భారత్‌గా నిలుపుతుంది'ఇటీవల 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలను నొక్కిచెబుతూ చేసిన వ్యాఖ్యలివి.యువత స్వదేశంలోనే జెట్ ఇంజిన్లు, సెమికండక్టర్ చిప్స్, ఇతర సాంకేతిక ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని కోరుతున్నా. తద్వారా మనం స్వయంసమృద్ధి సాధించగలం" అని అన్నారు.స్వయంసమృద్ధి అంటే, కేవలం దేశానికే పరిమితం కాదని.. ఇతర దేశాలతో పరస్పర సహకారం కొనసాగిస్తూ శక్తిసామర్థ్యాలను, స్వయంప్రతిపత్తిని పెంపొందించుకోవడమని కూడా అన్నారు.కార్లు, ఫోన్ల తయారీ నుంచి వస్త్రాలు, ఆహార భద్రత వరకూ భారత్ గత కొన్నేళ్లుగా అద్భుతమైన పురోగతి సాధించింది.అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గందరగోళ పరిస్థితులు, భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాల విధింపు వంటి వాటి కారణంగా, 'స్వదేశీ' ప్రచారం ఊపందుకుంటోంది. వ్యవసాయం, మైనింగ్, ఇనుము, ఉక్కు, వాహనాల విడిభాగాలు, పారిశ్రామిక యంత్రాలు, ఫర్నిచర్, తోలు, పాదరక్షల తయారీ, దేశీయ రక్షణ రంగ ఉత్పత్తులు, ఐటీ, ఇతర డిజిటల్ సేవల రంగాల్లో భారత్ స్వావలంబన సాధించింది.కానీ, ఇంకా విదేశీ ముడి పదార్థాలు, టెక్నాలజీ, రీసర్చ్‌పై ఆధారపడిన అనేక రంగాలున్నాయి.మొబైల్ ఫోన్లు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి అవసరమైన సెమికండక్టర్ చిప్స్ వంటి హైటెక్ ముడి వస్తువులను భారత్ దిగుమతి చేసుకుంటోంది.అంతేకాకుండా.. చైనా సాంకేతిక నైపుణ్యం, సరసమైన ధరల కారణంగా భారత్ ఈ వస్తువుల కోసం చైనాపై ఎక్కువగా ఆధారపడుతోంది.ఈ సెమికండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ ఇప్పటికే విధానపరమైన నిర్ణయాల విషయంలో చొరవ తీసుకుంది.మేక్ ఇన్ ఇండియా, ఇండియా సెమికండక్టర్ మిషన్, ప్రొడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ వంటి స్కీముల ద్వారా భారత్‌లో సెమికండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి అనువైన వాతావరణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది.ముడి పదార్థాలు/వస్తువుల లభ్యత గురించి ఎలిస్టా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సీఎండీ సాకేత్ గౌరవ్ మాట్లాడుతూ, "మేం స్మార్ట్ టీవీలను తయారుచేస్తాం. వాటిలో వినియోగించే ముఖ్యమైన విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. మా ఉత్పత్తులలో వినియోగించే అనేక భాగాలను ఇప్పటికీ దిగుమతి చేసుకుంటున్నాం. అవి భారత్‌లో తయారవడం లేదు" అని చెప్పారు.ఎలిస్టా కంపెనీ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో రూ.250 కోట్లతో మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించింది."అలాగే భారతీయ బ్రాండ్లు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటి ఏంటంటే.. ఇక్కడ తయారైన వస్తువులు నాణ్యత పరంగా బాగున్నప్పటికీ, మన వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడతారు" అని సాకేత్ గౌరవ్ అన్నారు.అయితే, రానున్న ఐదేళ్లలో సెమికండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి సాధిస్తుందని కూడా ఆయన అన్నారు."ఐదు నుంచి ఆరేళ్లలో ముఖ్యమైన విడిభాగాలను ఇక్కడే తయారు చేయగలమని ఆశిస్తున్నా. ప్రస్తుతం, అందుకు అవసరమైన టెక్నాలజీ, ప్రాసెస్ చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు" అని సాకేత్ గౌరవ్ చెప్పారు."భారత్‌లో తయారైన ఉత్పత్తులు విదేశీ బ్రాండ్ల కంటే తక్కువ ధరకే లభిస్తాయి. కానీ, వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడుతున్నారు."ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల నుంచి టర్బైన్ల వరకు, పర్మినెంట్ మాగ్నెట్స్, లైటింగ్, రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ యుద్ధ పరికరాలు, అనేక ఇతర రోజువారీ నిత్యవసరాలతో సహా అనేక ఉత్పత్తుల తయారీకి అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్ కోసం భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది.భారత్ తనకు అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో దాదాపు 99 శాతం దిగుమతి చేసుకుంటోంది. అందుకు చైనాపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది.భారత్‌లో రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను రీసైక్లింగ్ చేసే అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన అటెరో సీఈవో, కంపెనీ సహ వ్యవస్థాపకులు నితిన్ గుప్తా మాట్లాడుతూ, "భారత్ ప్రస్తుతం 99 శాతం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. కానీ, ఈ పరిశ్రమ పురోగతికి అనువైన వ్యవస్థను అభివృద్ధి చేసినట్లయితే.. భారత్ 70 శాతం అవసరాలను రీసైక్లింగ్ ద్వారా తీర్చుకోవచ్చు" అని అన్నారు.అటెరో కంపెనీ ఇటీవల తన సామర్థ్యాన్ని 300 టన్నుల నుంచి 30 వేల టన్నులకు పెంచుకుంది."చాలా ముఖ్యమైన ఉత్పత్తుల తయారీలో రేర్ ఎర్త్ మెటీరియల్స్ చాలా కీలకం. భారత్ ఈ విషయంలో స్వయంసమృద్ధి సాధించే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. భారత్‌లోనూ రేర్ ఎర్త్ మెటీరియల్స్ నిల్వలు ఉన్నాయి, కానీ ప్రస్తుతం వాటి మైనింగ్ జరగడం లేదు. ప్రపంచంలోని మొత్తం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో 99 శాతం చైనా నుంచే వస్తున్నాయి, ఈ విషయంలో భారత్ ఇప్పటివరకూ పెద్దగా చేసిందేమీ లేదు" అని నితిన్ గుప్తా అన్నారు."రీసైక్లింగ్ హబ్‌గా మారడం ద్వారా భారత్ తన అవసరాలను తీర్చుకునే దిశగా ముందుకెళ్లొచ్చు. మనం మార్కెట్‌లో పోటాపోటీ ధరకు రీసైకిల్ చేయగలం, కానీ అది భారీ స్థాయిలో జరగాల్సిన అవసరముంది."అయితే, కేవలం రీసైక్లింగ్ ద్వారానే భారత్ అవసరాలు తీరతాయా? అనేదే ఇక్కడి ప్రశ్న. విషయంలో నితిన్ గుప్తా ఆశావహంగానే ఉన్నారు..2025 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో, భారత్ 9.74 లక్షల టన్నుల డీఏపీ (డైఅమ్మోనియం ఫాస్ఫేట్)ను దిగుమతి చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో డీఏపీ మొత్తం దిగుమతులు దాదాపు 45.7 లక్షల టన్నులు. యూరియా దాదాపు 56 లక్షల టన్నులు. ఎరువుల తయారీలో ఇది చాలా కీలకం.దేశీయంగా అవసరమైన ఖనిజాల కొరతతో పాటు అభివృద్ధి చెందిన మైనింగ్, ప్రాసెసింగ్ వ్యవస్థ లేకపోవడం.లిథియం, కోబాల్ట్, మెగ్నీషియం, నికెల్ వంటి ముఖ్యమైన ఖనిజాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అయితే, ఈ కీలకమైన ఖనిజ నిల్వలు భారత్‌లో పరిమితంగానే ఉన్నాయి. లేదంటే నిల్వలు ఉన్నప్పటికీ.. మైనింగ్ సాధ్యమయ్యే పరిస్థితి లేదు.ఆర్థిక వ్యవహారాల విశ్లేషకులు, జర్నలిస్ట్ నరేంద్ర తనేజా మాట్లాడుతూ, "భారతీయ పరిశ్రమలు ముడి చమురు, పెట్రోకెమికల్స్ దిగుమతులపై ఆధారపడి ఉన్నాయి. పెట్రోకెమికల్స్‌పై ఆధారపడని రంగం దాదాపుగా అరుదు. కానీ, ఈ అవసరాలన్నింటికీ భారత్ దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్‌లో ముడిచమురు నిల్వలు లేవని కాదు, కానీ అవి ఉన్నచోట్ల వాటిని వెలికితీయడంలోనూ సవాళ్లున్నాయి" అని అన్నారు.భారత్ దేశీయ రక్షణ రంగ ఉత్పత్తిని ప్రోత్సహించినప్పటికీ, రక్షణ పరమైన అవసరాల కోసం ఇప్పటికీ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడి ఉంది.యుద్ధ విమానాల నుంచి జలాంతర్గాముల వరకు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను కూడా భారత్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.2023 గణాంకాల ప్రకారం, భారత్ తన రక్షణ బడ్జెట్‌లో 36 శాతం దిగుమతులపైనే ఖర్చు చేసింది.జెట్ ఇంజిన్లు, రాడార్ల వంటి హైటెక్ పరికరాలను భారత్ ఇప్పటికీ దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటోంది.ఇంకా, అధునాతన ఆయుధాల కోసం కూడా విదేశాలపై ఆధారపడుతోంది భారత్ దేశీయంగానూ రక్షణ రంగ ఉత్పత్తిని పెంచింది.



# విభజనతో పాటే కాశ్మీర్ చిచ్చు

### నాటి పాలకుల దృష్టి లోపం

### సమర్థ నాయకత్వ లోపంతో సమస్యలు


న్యూఢిల్లీ, : బ్రిటిష్ పాలకులు దేశాన్ని విభజించడమే కాకుండా.. అనేక మెలికలు పెట్టి వెళ్లారు. అలాంటి దాంట్లో కాశ్మీర్ సమస్య ఒకటి. నేటికీ అది రావణకాష్టంగా మారడానికి కారణం వారి కుత్సిత రాజకీయ తంత్రమే. వెళుతూవెళుతూ సంస్థానాలను వారి స్వేచ్ఛకు వదిలేసి వెళ్లారు. ఇదే క్రమంలో భారత్ ఆశ్రయం పొంది భారత్‌లో విలీనం కావడానికి కాశ్మీర్ రాజు హరిసింగ్ చేసిన ప్రయత్నాల ను విభజిత పాక్ అడ్డుకుంది. కొంత భాగాన్ని ఆక్రమించడంతో దిక్కులేని స్థితిలో కాశ్మీర్ రాజు భారత్ ఆశ్రయం పొందాడు. అయితే ఆనాటి ప్రధాని నెహ్రూ తాత్సారం, ఉదాసీనత కారణంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య అలాగే ఉండిపోయింది. అలాగే 370 ఆర్టికల్‌తో కొత్తచిచ్చును కూడా నెహ్రూ రాజేశారు. తొలుత కశ్మీర్ రాజు హరిసింగ్ స్వతంత్రంగా ఉంటానని చేసి, పాకిస్థాన్‌తో మమేకం అయ్యేందుకు ప్రయత్నించారు. కానీ వెంటనే తమతో మమేకం కాకపోవడంతో పాకిస్థాన్‌లోని ప్రభుత్వం ఆక్రమిత కశ్మీర్ భాగంలోని గిరిజనులను ఉసిగొలిపితే కశ్మీర్ రాజు హరిసింగ్.. నాటి నెహ్రూ ప్రభుత్వాన్ని శరణు కోరారు. తర్వాత కశ్మీర్ కూడా భారతదేశంలో భూభాగమైనా.. ఆక్రమిత కాశ్మీర్ సమస్యనేటికీ తెగడంలేదు. కాశ్మీర్ రాజు ఒప్పందం మేరకు కాశ్మీర్ యావత్తూ భారత్ భూభాగంగా ఉండాలి. కానీ పాక్ పాలకు తీరు, నాటి భారత్ పాలకుల ముందు చూపు లేకపోవడం కారణంగా నేటికి దానిని రావణ కాష్టంగా మార్చేశాయి. మిలిటెంట్ల చొరబాట్లు, పాక్ సైన్యం అకారణంగా కాల్పులు జరుపడం నిత్యకృత్యంగా మారింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. మత ఘర్షణల నివారణకే దేశ విభజన వందేండ్ల పోరాటం తర్వాత భారత్ 1947లో వలస పాలకుల నుంచి విముక్తి పొందింది. బ్రిటన్ పార్లమెంట్ స్థానంలో భారత స్వాతంత్ర్య చట్టం అమలులోకి వచ్చింది. ఆగస్టు 15వ తేదీ నుంచి బ్రిటీషువారి పాలన ముగుస్తుందని ఆ చట్టం నిర్దేశించింది. అలాగే దేశాన్ని రెండు సార్వభౌమ దేశాలైన ఐక్య భారత్, అధినివేశ పాకిస్థాన్‌గా విభజించాలని సూచించింది. రెండు దేశాలకు కేటాయించాల్సిన ప్రాంతాల పర్యవేక్షణకు బ్రిటీషు వారు సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌ను రంగంలోకి దించారు. వృత్తిరీత్యా న్యాయాధికారి రాడ్‌క్లిఫ్‌ను సరిహద్దు కమిషన్‌కు చైర్మన్‌గా నియమించారు. ఒక దేశాన్ని రెండు స్వతంత్ర దేశాలుగా విడగొట్టే గీత గీయడానికి ఈ కమిషన్‌ను నియమించారు. ఢిల్లీ దేశ విభజన అనంతరం దాదాపు 1.5 కోట్ల మంది తమ నివాస ప్రదేశాలను వదిలి రాడ్‌క్లిఫ్ గీతకు అటూ ఇటూ ప్రయాణిం చారు. వారిలో కొందరు కాలినడకన, మరికొందరు రైళ్లలో, బస్సుల్లో రవాణా వసతి ఏది దొరికితే దానిలో గీత దాటారు. ఈ సందర్భంగా జరిగిన మతోన్మాద మారణకాండలో దాదాపు పదిలక్షల మంది తమ ప్రాణాలు కోల్పోయారు. లక్షల కుటుంబాలు సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డాయి. వేల మంది మహిళలపై లైంగిక దాడులు జరిగాయి. దేశవిభజనతో ఒక ప్రాంతం నుంచి మరోప్రాంతానికి తరలివెళుతున్న నిరాశ్రయులైన జనంతో ఢిల్లీ గుడారాల నగరంగా మారిపోయింది. ఇండ్లను, పుట్టి పెరిగిన ప్రాంతాలను వదిలి, మతకల్లోలాల్లో సర్వం పోగొట్టుకొని శరణార్థులుగా మారారు. పాకిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులదీ ఇదే పరిస్థితి. అదే సమయంలో ఢిల్లీ జనాభాలో.. వలస వచ్చిన ప్రజల సంఖ్య దాదాపు మూడోవంతు వరకు చేరుకున్న దంటే.. ఏ స్థాయిలో వలసలు జరిగాయో ఊహించుకోవచ్చు. నిట్టనిలువునా చీలిన పంజాబ్ లోనూ ఇదే పరిస్థితి. పలు కాలేజీలు వలస ప్రజల శిబిరాలుగా మారిపోయాయి. కనీస సౌకర్యాలు లేక, ఆహారం లేక జనం అలమటించిపోయారు. ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ ఆహారం రోజుకు ఒక చపాతీకి తగ్గించారు. ఆకలితో అల్లాడి వేల మంది మరణించారు. ఇంతటి దారుణం తరవాత కూడా పాక్ భారత్‌తో యుద్ధం చేసి ఓడిపోయింది ఆనాడే ఆక్రమిత కాశ్మీర్ సంగతి తేల్చి వుంటే ఇవాళ ఈ గతి ఉండేది కాదని చరిత్రకారులు అంటారు.

# రైతులకు ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు

జయశంకర్ భూపాలపల్లి: రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి
లక్ష్మణ్ కుమార్, సీఎస్ రామ కృష్ణా రావు, ఇతర కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ భారతి దరఖాస్తుల తిరస్కారానికి సరైన కారణాలు చూపాలన్నారు. ఆగస్టు 15 నాటికి అన్ని దరఖాస్తులు పరిష్కరించాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పేదవాడికి ఏసమస్యా రాకూడదని స్పష్టం చేశారు. లబ్దిదారులకు దగ్గరలోని రీచ్‌ల నుండి ఉచిత ఇసుక ఇవ్వాలని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రూపుదిద్దుకున్న భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదేనని మంత్రి స్పష్టం చేశారు. భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అద్భుతమైన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసినప్పుడే దాని ఫలితాలు సామాన్యులకు అందుతాయని అన్నారు. మూడు దఫాలుగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి సామాన్యులను ముఖ్యంగా రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని, సస్పెండ్ చేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని, సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో 8.65 లక్షల దరఖాస్తులు వచ్చాయని ఇందులో ప్రధానంగా సాదాబైనామా, సర్వేనెంబర్ మిస్సింగ్, అసైన్డ్ ల్యాండ్ , అసైన్డ్ ల్యాండ్ రెగ్యులరైజేషన్, సక్సెషన్‌కు సంబంధించి సుమారు 6 లక్షల దరఖాస్తులు వచ్చాయని వీటిని ఐదు విభాగాలుగా విభజించి ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలన జరిపి ఆగస్టు 15వ తేదీలోగా పరిష్కరించాలన్నారు. సాదాబైనామాల అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని కోర్టు తీర్పుకోసం వేచిచూడకుండా దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం కోసం సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాల్లోని అసైన్డ్‌ల్యాండ్, లబ్దిదారుల వివరాలను ఈ నెల 30వ తేదీ లోగా ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్లకు సూచించారు. దరఖాస్తుల సంఖ్యను తగ్గించుకోవడానికి ఇష్టం వచ్చిన రీతిలో తిరస్కరించకూడదని, తిరస్కారానికి గల కారణాలను లిఖిత పూర్వకంగా స్పష్టంగా దరఖాస్తుదారునికి తెలియజేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.ఈ నెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జీపీవోలకు , జె ఎన్ టి యు ఆధ్వర్యంలో లైసెన్స్ డ్ సర్వేయర్లకు పరీక్ష నిర్వహిస్తున్నామని ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేసి పరీక్ష సజావుగా నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పేదవానికి ఏ సమస్య రాకూడదు పేదవాని సొంతింటి కల నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మణానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మేస్త్రి ధరలు, చెల్లింపులు, ఇసుక, సిమెంట్, ఇనుము విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏలాంటి సమస్య రాకుండా చూడాలని తెలిపారు. అలాగే ధరల నియంత్రణ కమిటీ చురుగ్గా పనిచేసేలా కలెక్టర్లు నిత్యం పర్యవేక్షించాలన్నారు.
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని , ఇది సరైన విధంగా లబ్దిదారులకు అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్దిదారులపై రవాణా భారం అధికంగా పడకుండా వీలైనంత దగ్గరలో ఇసుక అందేవిధంగా చూడాలన్నారు. బేస్‌మెంట్ నిర్మాణం కోసం అక్కడక్కడ అందుబాటులో ఉన్న మట్టిని తీసుకెళ్తున్న లబ్దిదారులపై పోలీసులు కేసులు నమోదుచేయడం సరైన చర్య కాదని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలన్నారు. నిరుపేదలైతే ఇల్లు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా కూడా ప్రతి చెల్లింపులు జరుపుతున్నామని అయితే సాంకేతిక సమస్యలతో కొంతమంది లబ్దిదారుల ఖాతాలో డబ్బులు జమ కావడం లేదని ఇటువంటి సమస్యలను గుర్తించి లబ్దిదారునికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రెండు పడక గదుల ఇండ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అర్హులైన లబ్దిదారులకు కేటాయించాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన భోజనం, విద్య అందించేందుకు కృషి చేయాలని అన్నారు ఎంవిద్యార్థుల బాగోగులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్లు పరిశీలించాలని తెలిపారు.

# కొంప ముంచుతున్న డేటింగ్ యాప్స్..




హైదరాబాద్, : ప్రస్తుతం డేటింగ్ యాప్‌లు ఎక్కువగా ఉంటున్నాయి. ఇందులో తెలియని వ్యక్తులతో డేటింగ్ చేస్తుంటారు. చివరకు ఇదే కొంపముంచుతుంది. తాజాగా ఇలాంటి ఘటనే హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్‌జీబీటీ డేటింగ్ యాప్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఓ 65 ఏళ్ల వ్యక్తి ఓ యువకుడితో మాట్లాడా డు. మొదట్లో చాటింగ్ చేసుకునే వారు. ఆ తర్వాత ఓ హోటల్‌లో ఇద్దరు కలిశారు. వీరిద్దరూ కలిసి నగ్నంగా ఉన్న సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు వీరి ఫొటోలు తీసి బెదిరించారు. 65 ఏళ్ల వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేశారు. ఎన్ని సార్లు ఇచ్చినా మళ్లీ అడగడంతో ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారుప్రస్తుతం హైదరాబాద్‌లో ఇలాంటి కేసులు పెరుగుతున్నాయి. ఇలాంటి డేటింగ్ యాప్‌లో కలిసి మోసం చేస్తున్నారు. ఎక్కువగా స్వలింగసంపర్కుల మధ్య ఇలాంటివి జరుగుతున్నాయి. సాధారణంగా ఈ ఎల్‌జీబీటీ యాప్స్‌లో లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్స్ ఉంటారు. ఇందులో ఎవరైతే ధనికులు ఉంటారో వారినే టార్గెట్ చేసి మోసం చేస్తున్నారు. వీరికి ఈయాప్స్ ద్వారాదగ్గర అయ్యి ముగ్గు లోకి దించుతున్నారు. ఆ తర్వాత వారిని హోటల్స్, ఫామ్ హౌస్‌లకు పిలిచి మత్తులోకి దించి నగ్న ఫొటోలు తీస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌కి చెందిన మరో డాక్టర్‌కు కూడా ఇలానే జరిగింది. ఒక యాప్‌లో పరిచయమైన వ్యక్తితో చాటింగ్ చేశాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి పిలవగానే ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. అక్కడ ఇద్దరూ మద్యం తాగారు.మద్యం మత్తులో ఉన్నప్పుడు, ఆ వ్యక్తి డాక్టర్ నగ్న ఫోటోలు తీశాడు. ఈ విషయం తెలియని డాక్టర్ అక్కడి నుంచి తిరిగి వచ్చాడు. కానీ కొన్ని రోజుల తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు డాక్టర్ నగ్న ఫోటోలను వాట్సాప్‌లో పంపి, బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెట్టారు. భయపడిన డాక్టర్ మోసగాళ్లు అడిగిన డబ్బులు ఇచ్చారు. ఇలాంటి కేసులు ఎక్కువగా రావడంతో పోలీసులు వీరిపై నిఘా పెట్టారు. డేటింగ్స్, ట్రాన్స్ వారిని గుర్తిస్తున్నారు. మోసం చేసేవారు ముందుగా ఎల్‌జీబీటీ యాప్స్‌లో సభ్యత్వం తీసుకుంటారు. ఆ తర్వాత పలుకుబడి, డబ్బులు ఉన్న వారిని టార్గెట్ చేస్తారు. వారితో ప్రేమగా మాట్లాడి, స్నేహం చేసి మెల్లిగా తమ ఉచ్చులోకి లాగుతారు. ఇలాంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సోషల్ మీడియా ఎక్కువ కావడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. తెలియని వ్యక్తులను కలిసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మత్తులోకి ఎక్కించి ఆ తర్వాత చీట్ చేస్తున్నారని తెలిపారు.



## గ్రామీణ 'ఉపాధి'పై మోడీ సర్కార్ నిర్లక్ష్యం

### - నిధులు ఇవ్వకుండా మీనమేషాలు

### - జాప్యంపై స్టాండింగ్ కమిటీ ఆగ్రహం

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలబిస్తున్న నిర్లక్ష్య ధోరణి మరోమారు తేటతెల్లమైంది. బడ్జెట్‌లో కేటాయించిన అరకొర నిధులను కూడా సకాలంలో మంజూరు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో ఉపాధి కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు, సామగ్రి బిల్లులకు తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కార్మికులకు వేతనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు వెంటనే పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు సూచించింది. సామగ్రి కొనుగోలుకు సంబంధించి తాను అడిగిన ప్రశ్నకు మంత్రిత్వ శాఖ సమాధానం దాటవేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంతటి ముఖ్యమైన విషయాన్ని విస్మరించడమేమిటని నిలదీసింది. ఈ మేరకు కాంగ్రెస్ సభ్యులు సప్తగిరి ఉలాకా నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సోమవారం పార్లమెంటుకు నివేదిక సమర్పించింది. 2025-26 సంవత్సరానికి సంబంధించిన బడ్జెటరీ కేటాయింపులపై కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం%ౌ%కార్మికులకు రూ.12,219.18 కోట్ల వేతనాలు పెండింగులో ఉన్నాయి. సామగ్రి కొనుగోలుకు సంబంధించి రూ.11,227.09 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో బకాయిలు 27.26 శాతంగా ఉన్నాయి. అంటే కేటాయించిన నిధులలో నాలుగో వంతు నిధులను గత సంవత్సరపు బకాయిల చెల్లింపులకే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు వాస్తవ బడ్జెట్ రూ.62,553.73 కోట్లు. బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా డిమాండ్‌కు అనుగుణంగా పథకాన్ని అమలు చేయడం కష్టమవుతుందని కమిటీ తెలిపింది. వేతనాలు, సామగ్రి కింద కేంద్ర ప్రభుత్వ వాటా నిధులను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయాన్ని పటిష్టవంతం చేసుకోవాలని, బకాయిల చెల్లింపులో ఇకపై ఎలాంటి జాప్యం జరగకుండా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కమిటీ తన నివేదికలో సూచించింది.

## ఎక్సైజ్ సీఐ,ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన సదస్సు..

జమ్మికుంట,: స్థానిక జమ్మికుంట గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో జమ్మికుంట ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సీఐ, మాధవి లత, ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. దీనిని ఉద్దేశించి ఎక్సైజ్ సీఐ,మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి యువత బానిస అవుతే వారి జీవితం సర్వనాశనం అవుతుందని అంతేకాకుండా కన్న తల్లిదండ్రుల యొక్క ఆశయాలను నిర్వీర్యం చేసిన వాళ్ళు అవుతారని డ్రగ్స్ అమ్మేటువంటి లేదా డ్రగ్స్ తీసుకునేటువంటి విద్యార్థిని విద్యార్థులు కావచ్చు ఇంకా ఎవరైనా మీకు తెలిసిన వారు ఉంటే ఎక్సైజ్ సీఐ, కు సమాచారం ఇవ్వవలసిందిగా పిల్లల్ని ఉద్దేశించి సీఐ మాధవి లత, తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వి.పెద్దన్న, మరియు ఎండి ఫయాజుద్దీన్, శైలజ, ప్రిన్సిపల్ కుమారస్వామి, అధ్యాపకులు రాగశ్రీ, అంజిబాబు, రమేష్,సాగర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు...



# జంతు సంబంధ పాలను తాగలేరా..?

## అవి ఇష్టం లేదా..? అయితే వృక్ష సంబంధ పాలను తాగండి..!



పాలను తాగడం వల్ల ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. పాలలో మన శరీరానికి కావల్సిన దాదాపు అన్ని పోషకాలు ఉంటాయి. అందుకనే పాలను సంపూర్ణ పౌష్టికాహారంగా పిలుస్తారు. చిన్నారులకు పోషణ లభించాలంటే కచ్చితంగా పాలను తాగించాల్సి ఉంటుంది. దీంతో వారిలో ఎదుగుదల సరిగ్గా ఉంటుంది. ఇక పెద్దలు కూడా కొవ్వు తీసిన పాలను తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. అయితే పాలలో లాక్టోజ్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది అందరికీ పడదు. అందువల్ల పాలను తాగితే కొందరికి పడవు. అలర్జీలు వస్తాయి. అయితే అలాంటి వారు వృక్ష సంబంధ పదార్థాలతో తయారు చేసిన పాలను తాగవచ్చు. సాధారణ పాలకు ప్రత్యామ్నాయంగా ఇవి పనిచేస్తాయి. సాధారణ పాలలో ఉండే పోషకాలు అన్నీ ఈ పాలలోనూ ఉంటాయి. ముఖ్యంగా వృక్ష సంబంధ పాలలో లాక్టోజ్ ఉండదు. ఫలితంగా ఈ పాలను ఎవరైనా తాగవచ్చు. పాలు అంటే అలర్జీ ఉన్నవారు వృక్ష సంబంధమైన పాలను తాగుతుంటే పోషకాలను పొందవచ్చు. అలర్జీలు రావు. వృక్ష సంబంధమైన పాలలో పలు రకాలు కూడా ఉన్నాయి.

**బాదంపాలు..:** వృక్ష సంబంధమైన పాల విషయానికి వస్తే బాదంపాలను మొదటి స్థానంలో ఉంటాయని చెప్పవచ్చు. మార్కెట్‌లో మనకు బాదంపాలు లభిస్తాయి. కానీ వీటిలో చక్కెర అధికంగా ఉంటుంది. కనుక బాదంపాలను మనం ఇంట్లోనే సులభంగా తయారు చేసి తాగవచ్చు. సాధారణ పాలు అంటే ఇష్టం లేని వారు లేదా ఆ పాలు పడని వారు బాదంపాలను తాగవచ్చు. బాదంపప్పులను నీటిలో నానబెట్టి పొట్టు తీసి వాటిలో నీళ్లు పోసి మిక్సీ పట్టాలి. అనంతరం వడకట్టాలి. దీంతో బాదంపాలు రెడీ అవుతాయి. ఈ పాలలో అవసరం అనుకుంటే కాస్త తేనె వేసి తాగవచ్చు. బాదంపప్పులో అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ ఇ, మెగ్నిషియంతోపాటు ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. అందువల్ల బాదంపాలను తాగితే మనకు ఎంతగానో మేలు జరుగుతుంది.

**సోయాబీన్స్ పాలు..:** సోయాబీన్స్‌తోనూ పాలను తయారు చేసి తాగవచ్చు. సోయాపాలు కూడా మనకు మార్కెట్‌లో లభిస్తాయి. కానీ వీటిని కూడా ఇంట్లోనే తయారు చేసి తాగితే మంచిది. ఈ పాలలో ప్రోటీన్లు, ఐరన్, క్యాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనకు పోషణను అందిస్తాయి.

శరీరాన్ని శక్తివంతంగా మారుస్తాయి. ఈ పాలను మనం వంటల్లో కూడా ఉపయోగించవచ్చు. అలాగే కొబ్బరితో పాలను తయారు చేసి కూడా తాగవచ్చు. ఇందుకు గాను పచ్చి కొబ్బరిని ఉపయోగించాల్సి ఉంటుంది. కొబ్బరిలో మన శరీరానికి ఉపయోగపడే అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా పొటాషియం, మాంగనీస్ ఉంటాయి. ఇవి మనకు రోగాలు రాకుండా రక్షిస్తాయి.

**ఓట్స్ పాలు..:** గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో, హార్ట్ ఎటాక్ రాకుండా చూడడంలో ఓట్స్ ఎంతగానో సహాయ పడతాయి. అయితే వీటితోనూ పాలను తయారు చేసి తాగవచ్చు. ఓట్స్‌లోనూ అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా అనేక బి విటమిన్లతోపాటు ఫైబర్, ఐరన్ సమృద్ధిగా ఉంటాయి. ఓట్స్‌ను తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. అలాగే రక్తం తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడవచ్చు. ఇక జీడిపప్పుతోనూ పాలను తయారు చేసి తాగవచ్చు. ఈ పాలలో జింక్, మెగ్నిషియం సమృద్ధిగా ఉంటాయి. ఈ పాలను సూప్‌లు, స్మూతీలు, కాఫీలో కూడా ఉపయోగించవచ్చు. అలాగే బియ్యంతోనూ పాలను తయారు చేసి తాగవచ్చు. వీటిల్లో పిండి పదార్థాలు, పలు రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇలా జంతువులు పాలు పడని వారు లేదా ఆ పాలు అంటే ఇష్టం లేని వారు వృక్ష సంబంధ పదార్థాలతో చేసిన పాలను ప్రత్యామ్నాయంగా తాగవచ్చు. ఈ పాలతోనూ అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.




# మద్యానికి దూరంగా భారత సంపన్నులు!

భారత్‌లోని సంపన్నులకు సంబంధించి ఆసక్తికర విషయం వెల్లడైంది. దేశంలోని ధనికుల్లో మూడింట ఒకవంతు మంది మద్యానికి దూరంగా ఉన్నారని తెలిసింది. దేశంలో సంపన్నులకు సంబంధించి మెర్సెడెస్ బెంజ్ హురున్ ఇండియా లగ్జరీ కన్‌జ్యూమర్ సర్వే 2025 ఈ వివరాలు వెల్లడించింది.సర్వేలో పాల్గొన్న 150 మంది వ్యక్తిగత నికర సంపద విలువ రూ. 8.5 కోట్లుగా ఉంది.

వీరిలో 34శాతం మంది మద్యం అస్సలే సేవించమని చెప్పారు. వీరిలో 32శాతం మంది మద్యం తాగుతున్నట్లు చెప్పగా.. 'విస్కీ'కి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మరో 11శాతం రెడ్ వైన్, 9శాతం మంది షాంపైన్ తాగేందుకు ఇష్టపడుతున్నట్లు తేలింది. నగదు, కార్డులతో పోలిస్తే సంపన్నులు కూడా యూపీఐ చెల్లింపు విధానమే తమకు ఇష్టమని చెప్పినట్లు తాజా సర్వే వెల్లడించింది. సర్వేలో స్పందించిన వారిలో 35శాతం మంది యూపీఐ విధానానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపింది. నగదు 18శాతం, ఆర్టీజీఎస్/ఎన్‌ఈఎఫ్‌టీ చెల్లింపులకు 16శాతం మంది జై కొడుతున్నట్లు పేర్కొంది. 8.71లక్షల కుటుంబాల నికర సంపద విలువ రూ. 8.5కోట్లుగా ఉందని తాజా సర్వే వెల్లడించింది. ముంబయి 'మిలియనీర్ క్యాపిటల్'గా నిలిచిందని, 1.42లక్షల సంపన్న కుటుంబాలు ఉన్నాయని తెలిపింది. ఆ తర్వాతి స్థానాల్లో దిల్లీ (68,200), బెంగళూరు (31,600) కుటుంబాలు ఉన్నాయని పేర్కొంది. రాష్ట్రాల విషయానికొస్తే మిలియనీర్ల కుటుంబాల్లో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉందని తెలిపింది.

# ఉల్లికాడలతో సూప్ తయారు చేసి తాగితే..

## ఎన్ని ప్రయోజనాలు కలుగుతాయంటే.. ఆశ్చర్యపోతారు..!




ఉల్లికాడలు మనకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయి. కానీ వీటిని చాలా మంది అంతగా వాడరు. ఉల్లికాడలను కొందరు కూరల్లో వేస్తుంటారు. అయితే ఆరోగ్య ప్రయోజనాల విషయానికి వస్తే ఇవి అనేక లాభాలను అందిస్తాయి. ఉల్లికాడల్లో మన శరీరానికి ఉపయోగపడే అనేక పోషకాలు ఉంటాయి. ఉల్లికాడలను తరచూ ఆహారంలో భాగం చేసుకున్నా లేదా ఉల్లికాడలతో జ్యూస్ తయారు చేసి రోజూ 30 ఎంఎల్ మోతాదులో సేవిస్తున్నా ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ఉల్లికాడల్లో కెమోఫెరాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఒక ఫ్లేవనాయిడ్. రక్తనాళాలపై పడే ఒత్తిడిని తగ్గిస్తుంది. రక్తం సాఫీగా ప్రసారం అయ్యేట్లు చేస్తుంది. దీంతో హైబీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తుంది.

బీపీ నియంత్రణలో..: ఉల్లికాడలను తరచూ తీసుకుంటే హైబీపీ నియంత్రణలో ఉంటుంది. వీటిల్లో క్యాల్షియం అధికంగా ఉంటుంది. కనుక వీటిని తరచూ తింటే ఎముకలు దృఢంగా మారి, ఆరోగ్యంగా ఉంటాయి. వయస్సు మీద పడడం వల్ల వచ్చే ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల వ్యాధులు రాకుండా చూస్తాయి. ఉల్లికాడల్లో ఉండే ఫోలేట్లు గుండె జబ్బులు రాకుండా రక్షిస్తాయి. ఉల్లికాడలను తరచూ తింటే కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాదు. ఉల్లికాడల్లో క్రోమియం అధికంగా ఉంటుంది. కాబట్టి తరచూ వీటిని తింటే షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. మధుమేహం ఉన్నవారికి ఉల్లికాడలు ఎంతో మేలు చేస్తాయి. రోజూ వీటి జ్యూస్‌ను సేవిస్తుంటే షుగర్‌ను అదుపులో ఉంచుకోవచ్చు.

దగ్గు, జలుబు, జ్వరం తగ్గుతాయి..: దగ్గు, జలుబు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఉల్లికాడలతో తయారు చేసే సూప్‌ను తాగుతుంటే త్వరగా కోలుకుంటారు. ఆయా సమస్యల నుంచి సత్వరమే ఉపశమనం లభిస్తుంది. ఉల్లికాడల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తుంది. దీంతో గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం నుంచి బయట పడవచ్చు. మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను కూడా శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. ఉల్లికాడల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో రోగాల నుంచి శరీరానికి రక్షణ లభిస్తుంది. అలాగే ఉల్లికాడలను తినడం వల్ల పెద్ద పేగు క్యాన్సర్ రాదని సైంటిస్టుల పరిశోధనల్లో వెల్లడైంది.

క్యాన్సర్ రానీయవు..: ఉల్లికాడల్లో పెక్టిన్ అధికంగా ఉంటుంది. ఇది పెద్ద పేగు క్యాన్సర్ వచ్చే అవకాశాలను గణనీయంగా తగ్గిస్తుంది. కీళ్లనొప్పులు, ఉబ్బసం వంటి సమస్యలు ఉన్నవారు ఉల్లికాడలతో సూప్‌ను తయారు చేసి రోజూ తాగుతుంటే ఆయా సమస్యల నుంచి బయట పడవచ్చు. ఉల్లికాడల్లో క్వర్సెటిన్ అధికంగా ఉంటుంది. ఇది సహజసిద్ధమైన పెయిన్ కిల్లర్‌గా పనిచేస్తుంది. దీంతో కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి. అలాగే అధికంగా బరువు ఉన్నవారు ఉల్లికాడలతో సూప్‌ను తయారు చేసి రోజూ తాగుతుంటే శరీరంలోని కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. ఇలా ఉల్లికాడలు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.

# అతి చల్లని నీరు అనారోగ్యదాయకం!



ఎండల్లో చాలామంది చల్లని నీరు తాగడానికే ఇష్టపడతారు. అయితే ఈ రోజుల్లో అందరూ అతి చల్లటి నీటి కోసం ఫ్రిజ్‌లో భద్రపర్చిన నీళ్లనే ఎక్కువగా ఎంచుకుంటారు. ఇది బాగా చల్లగా ఉండడం వల్ల ఆరోగ్యాన్ని చాలా దెబ్బ తీస్తుందని నిపుణులు చెబుతున్నారు.


మలబద్ధకం : ఫ్రిజ్ నీరు తాగడం వల్ల మలబద్ధక సమస్య వస్తుంది. ఎండ నుండి నీడకు వచ్చిన వెంటనే ఈ నీరు తాగినప్పుడు పేగులు కుంచించుకుపోతాయి. పొత్తికడుపు నొప్పి ఏర్పడుతుంది. తద్వారా మలబద్ధకం, జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. గుండె వేగంపై ప్రభావం : వేసవి కాలంలో ఫ్రిజ్ నీటిని ఎక్కువగా తాగడం వల్ల హృదయ స్పందన రేటు తగ్గుతుంది. ఇది గుండెపోటుకు కూడా కారణం కావచ్చు. చల్లటి నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థపై కూడా చెడు ప్రభావం పడుతుంది.

తలనొప్పి రావొచ్చు : ఫ్రిజ్ నీరు ఎక్కువసార్లు తాగడం వల్ల బ్రెయిన్ ఫ్రీజ్ సమస్య కూడా వస్తుంది. ఈ నీరు నరాల్లోకి చేరిన వెంటనే మెదడుకు సందేశాలు పంపుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఇది తలనొప్పి సమస్యను కలిగిస్తుంది.

శక్తి తగ్గుతుంది : ఫ్రిజ్ నీరు తాగడం వల్ల జీవక్రియ వ్యవస్థ మందగించి, కొవ్వును సరిగ్గా విడుదలచేయలేరు. కొన్నిసార్లుఇది బలహీనత, అలసటను కూడా కలిగిస్తుంది. కాబట్టి ఫ్రిజ్‌లో చల్లబడిన నీటి కంటే మట్టి కుండల్లో చల్లబడిన నీటిని తాగడం మంచిది.

# రోజూ రన్నింగ్ లేదా వాకింగ్ చేస్తున్నారా..?

## అయితే ఈ ఆహారాలను తినండి..!



ఆరోగ్యంగా ఉండాలంటే వేళకు నిద్రించడం మాత్రమే కాదు, సరైన ఆహారాన్ని కూడా తీసుకోవాలి. రోజూ వ్యాయామం కూడా చేయాలి. ఈ క్రమంలోనే డబ్బులు ఖర్చు పెట్టి ఖరీదైన జిమ్‌లకు వెళ్లడం ఇష్టం లేని వారు తమకు ఉన్న స్థలంలో లేదా పార్కులు, రహదారులపై ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, రన్నింగ్, జాగింగ్ వంటివి చేస్తుంటారు. వాకింగ్, రన్నింగ్ తదితర వ్యాయామాలకు ఎలాంటి ఖర్చు చేయాల్సిన పనిలేదు. ఎవరైనా సరే ఈ వ్యాయామాలను సులభంగా చేయవచ్చు. వీటి వల్ల శరీరం ఫిట్‌గా ఉండడమే కాదు, వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. అయితే ఈ వ్యాయామాలు చేసేవారు కచ్చితంగా సనైన ఆహారాన్ని తీసుకోవాలి. అప్పుడే శక్తి లభించి ఉత్సాహంగా మరింత ఎక్కువ వ్యాయామం చేస్తారు.

బాదంపప్పు..: వ్యాయామాలు చేసేవారు సరైన ఆహారం తినకపోతే శక్తి లభించదు. దీంతో వ్యాయామంపై ఆసక్తి తగ్గిపోతుంది. కనుక రన్నింగ్ లేదా వాకింగ్ వంటి వ్యాయామాలు చేసేవారు తమ ఆహారం విషయంలోనూ మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. పలు రకాల ఆహారాలను తింటే శక్తి లభించి ఆయా వ్యాయామాలను మరింత ఉత్సాహంగా చేస్తారు. అలాగే కండరాలకు పోషణ కూడా లభిస్తుంది. రన్నింగ్, వాకింగ్ చేసేవారు తినదగిన ఆహారాల్లో బాదంపప్పు మొదటి స్థానంలో ఉంటుందని చెప్పవచ్చు. బాదంపప్పును రోజూ గుప్పెడు మోతాదులో నీటిలో నానబెట్టి వాటిని పొట్టు తీసి తినాలి. ఈ పప్పునురాత్రి నానబెట్టి మరుసటి రోజు ఉదయం తింటే మంచిది. వ్యాయామం చేశాక తింటే కోల్పోయిన శక్తి మళ్లీ వస్తుంది. అలాగే కండరాలు ప్రశాంతంగా మారుతాయి. కండరాల నొప్పులు తగ్గుతా యి. మరుసటి రోజు మరింత ఉత్సాహంగా వ్యాయామం చేస్తారు.

నారింజ పండ్లు..: బాదంపప్పుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. ఇవి కీళ్ల నొప్పులు రాకుండా చూస్తాయి. కండరాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో ఎంత వాకింగ్ లేదా రన్నింగ్ చేసినా నొప్పులు అనేవి ఉండవు. బాదంపప్పులో ఉండే ప్రోటీన్లు కండరాలు నిర్మాణం అయ్యేలా చేస్తాయి. దీంతో కండరాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే బాదంలో ఉండే ఫైబర్ బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. జంక్ ఫుడ్ తినకుండా చూస్తుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీని వల్ల జంక్ ఫుడ్ జోలికి వెళ్లరు. ఇలా ఆయా వ్యాయామాలు చేసేవారు బాదంపప్పును తింటే ఎంతో మేలు జరుగుతుంది. అలాగే నారింజ పండ్లను కూడా ఆహారంలో భాగం చేసుకోవాలి. రోజూ ఈ పండ్లను తింటున్నా లేదా వీటి జ్యూస్‌ను తాగుతున్నా కూడా ఫలితం ఉంటుంది. నారింజ పండ్లలో ఉండే విటమిన్ సి కండరాలకు శక్తిని అందిస్తుంది. దీంతో ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. నీరసం, అలసట అనేవి రావు.

చిలగడదుంపలు..: వ్యాయామం చేసేవారు చిలగడదుంపలను కూడా తింటుండాలి. వీటిల్లో పొటాషియం, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి కండరాలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. కండరాల నొప్పులు తగ్గేందుకు సహాయం చేస్తాయి. కాబట్టి వ్యాయామం చేసేవారు ఈ దుంపలను కూడా కచ్చితంగా తింటుండాలి. అలాగే వారంలో కనీసం 2 సార్లు చేపలను తినాలి.

# బాల్యంలోనే.. ఆర్థిక అక్షరాస్యత

నేటితరం తల్లిదండ్రులు.. పిల్లలకు డబ్బు విలువ తెలియకుండా పెంచుతున్నారు. ముఖ్యంగా.. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వాళ్లే ఈ ట్రెండ్‌ను ఎక్కువగా ఫాలో అవుతున్నారు. అయితే, ఇలా పిల్లలకు డబ్బు విలువ తెలియకుండా పెంచడం ఏమాత్రం మంచిదికాదని ఆర్థిక నిపుణులు అంటున్నారు. పిల్లలకు బాల్యంనుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచాలని సూచిస్తున్నారు. లేకుంటే.. భవిష్యత్తులో దుబారాకు మారుపేరుగా నిలుస్తారని హెచ్చరిస్తున్నారు.

పిల్లలకు అడిగినంత కాకుండా.. తక్కువ పాకెట్ మనీ ఇవ్వండి. ఎక్కువ కావాలంటే.. ఇంటిపనులు చేసి సంపాదించుకోవాలని చెప్పండి. ఇలా చేయడం వల్ల పిల్లలు ఇంటి పనులు నేర్చుకుంటారు. డబ్బును పొదుపు చేయడం అలవాటు చేసుకుంటారు. వారికి పని విలువ, డబ్బు విలువ తెలియడంతోపాటు, క్రమశిక్షణ కూడా అలవడుతుంది. కాబట్టి, పిల్లలకు చిన్నతనం నుంచే పనులు చేయడం నేర్పించాలి. డబ్బు సంపాదించడం ఎంత కష్టమో వాళ్లకు అర్థమయ్యేలా చూడాలి. పిల్లలకు మామూలు కిడ్డీ బ్యాంకులకు బదులుగా.. గ్లాసుతో తయారైన కిడ్డీ బ్యాంకులను ఇవ్వండి. అందులో జమచేసే డబ్బులు రోజురోజుకూ పెరుగుతూ వారికి కనిపిస్తుంటే.. వారిలోనూ



డబ్బులు ఇంకాఇంకా పొదుపు చేయాలన్న ఆసక్తి పెరుగుతుంది. మీ నెలవారీ ఖర్చులు, ఇంటి బడ్జెట్ గురించి పిల్లలకు చెప్పండి. మీ సంపాదన, ఖర్చులు, పొదుపు.. ఇలా అన్ని విషయాలను వారితో పంచుకోండి. దీనివల్ల మీ ఆదాయానికి తగ్గట్టుగానే ఖర్చు చేయడం అలవాటుగా మార్చుకుంటారు.

డబ్బులను ఖర్చు పెట్టేముందు.. ఒకటికి రెండుసార్లు ఆలోచించుకునేలా పిల్లలకు మార్గనిర్దేశం చేయండి.

# అడుగడుగునా గుంతలు..!




**హైదరాబాద్,: ఒక పక్క వర్షాలతో నగర వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా.. బండి బయటకు తీసి వెళ్లాలంటే వాహనదారుడి నడ్డి విరిగిపోతుంది.. అడుగడుగున గుంతలతో నగర వాసి ప్రయాణం దిన దిన గండంగా మారుతోంది. గంటల తరబడి ప్రయాణంతో రోడ్లపైనే గడుపుతూ నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.**

ప్రతి రోజు ట్రాఫిక్ సమస్యతో సతమవు తూ.. ఏం జీవితం రాబాబూ అంటూ నగర వాసి నిట్టూరుస్తున్నాడు.. వర్షాకాలం వస్తుందని తెలుసు, వర్షం పడినప్పుడు వెంటనే తీసుకోవా ల్సిన తాత్కాలిక చర్యలు ఉంటాయి, కాని అధికార యంత్రాంగం మాత్రం తమ మొద్దు నిద్ర వీడడం లేదంటూ ప్రజలు మండిపడుతు న్నారు. వారం రోజులుగా నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాఖీపౌర్ణమి కావడంతో నగరం నుంచి బయటకు వెళ్లేవా రు, బయట నుంచి నగరానికి వచ్చేవారితో రోడ్లన్ని రద్దీగా మారాయి. అసలే ట్రాఫిక్ దానికి తోడు రోడ్లన్ని ఎక్కడికక్కడ గుంతల మయంగా మారడంతో నగర పౌరుల ప్రయాణం క్షణ క్షణం గండంగా మారింది. రాత్రి 10.30 గంటల సమయంలో నగర వ్యాప్తంగా భారీ వర్షం కురియడంతో ఇక ట్రాఫిక్ ఎక్కడికక్కడే ఆగిపోయి సమస్య మరింతగా పెరిగిపోయింది. నగరంలో రోడ్డునెంబర్ 1 నుంచి మాసబ్ట్యాంక్‌కు వెళ్లాలంటే రాత్రి 11 గంటల సమయంలో గంటకుపైగా సమయం పట్టిందంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడికక్కడే గుంతలు!: నగరంలోని ప్రధాన రహదారులతో పాటు శివారులలోని ప్రధాన రూట్లలో ట్రాఫిక్ రద్దీ ఎక్కడకక్కడే ఏర్పడుతుంది. ఇందుకు ప్రధాన కారణం రోడ్లపై ఎక్కడి గుంతలు అక్కడే ఉంటున్నాయి, ఆయా గుంతలను కనీసం తాత్కాలికంగా పూడ్చీ వాహనాల వేగం పెంచాలనే ఆలోచన కూడా యంత్రాంగానికి లేకపోవడంతో వాహనదారులు ప్రతినిత్యం ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. బంజారాహిల్స్ వంటి ప్రాంతాలలోను కొన్ని చోట్ల రోడ్లు కోతంకు గురయ్యాయి, ఐటీ కారిడార్‌లలోను రోడ్లపై గుంతలు పడ్డాయి. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్, సాగర్ రోడ్డు, ఉప్పల్ వంటి ప్రాంతాలలోని ప్రధాన రహదారులన్ని గుంతలతో నిండిపోతున్నాయి. బాలాపూర్ చౌరస్తా దాటగానే యూటర్న్ వద్దగత రెండు మూడు నెలలుగా రోడ్డంతా అధ్వాన్నంగా మారింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే అక్కడ సమస్య ఉంది. వర్షాకాలం రావడం, రెండు మూడు భారీ వర్షాలు కురవడంతో అక్కడ పరిస్తితి మరింత దారుణంగా మారింది. ఈ రూట్‌లోనే ఎయిర్‌పోర్టుకు వెళ్లేవారితో వాహనాల రద్దీ ఉంటుంది. సుమారు రెండు నెలలవుతున్నా ఇక్కడ కనీస చర్యలు తీసుకొని వాహనాలు వేగంగా వెళ్లాలనే ఆలోచన యంత్రాంగం చేయడకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఒకే చోట కాకుండా ఉప్పల్, ఎల్బీనగర్‌లోని రోడ్లలోని ప్రధాన రహదారులపై ఇలాంటి పరిస్తితి నెలకొంది. అసలే భారీ వర్షాలు.. దానికి తోడు రోడ్లన్ని గుంతల మయంగా మారడంతో వాహనాల కదలిక ఎక్కడికక్కడే నెమ్మదించడంతో ఆ ప్రభావం ఇతర రహదారులపై కూడా పడుతుంది. దీంతో నగరంతో పాటు నగర శివారు ప్రాంతాలపై ట్రాఫిక్‌లో చిక్కుకొని నరకం అనుభవించాల్సిన పరిస్థితి.

రోడ్ల పరిస్థితి ఆధ్వాన్నం: నగర వ్యాప్తంగా ఎక్కడ చూసిన దారి పొడవునా గుంతలు, కంకర తేలిన రోడ్లు, వానలేని సమయంలో దుమ్ము,దూళితో నిండిపోయిన రహదారులు కన్పిస్తున్నాయి. వర్షం కురిస్తే బురద రోడ్లపైకి వవస్తుంది, మరుసటి రోజుకు అది అక్కడే ఉంటుంది, ప్రధాన రహదారులలోని కొన్ని చోట్ల మాత్రం దానిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ అంతర్గత రోడ్లు, ఇతర రోడ్లలో మాత్రం ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. కూకట్‌పల్లి, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, ఎల్బీనగర్, జూబ్లీహిల్స్, ఆమీర్‌పేట, సికింద్రాబాద్, ఉప్పల్, తార్నాక, హబ్సిగూడ, ముషీరాబాద్, రాంనగర్, కుత్బుల్లాపూర్, బాలానగర్, తదితర చోట్ల రహదారులు వర్షాలకు దెబ్బతినడం, మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో ఆ రోడ్లపై వెళ్లడం ఇబ్బందికరంగా మారిందంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్లపై వర్షం పడ్డ, రద్దీ సమయంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది, వాహనదారులు ప్రత్యామ్నాయ రూట్లలో అంతర్గత రహదారులలోకి వెళ్తుంటారు. ఇక అంతర్గత రహదారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ రద్దీ ఏర్పడి పక్క రూట్లలోకి వెళ్లే ఎక్కడ ఏ గుంత ఉందో, ఎక్కడ ఏ మ్యాన్ హెూల్ తెరిచిందో తెలియని పరిస్థితి నెలకొంటంది. దీంతో అంతర్గత రహదారులలోకి వెళ్లి ఇబ్బందులు తెచ్చుకోవడం ఎందుకని చాలామంది కష్టమైనా సరే గంటల తరబడి ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌లోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గుంతల రోడ్లపై ప్రయాణంలో ఒళ్లు హూనం చేసుకోవాల్సి వస్తుందని, గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో వాహన కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతున్నామంటూ వాహనదారులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా గుంతల రోడ్లతో పాటు ఎక్కడికక్కడే ఇసుక, బురద మేటలు రోడ్లపై ఉండడంతో వాహనాలు స్కిడ్ అవుతున్నాయంటూ వాహదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అధిక స్క్రీన్ టైమ్‌తో పిల్లలకు గుండె జబ్బుల ముప్పు!



న్యూఢిల్లీ : ఇటీవలి కాలంలో అందరూ టీవీలు, స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్లకు అతుక్కుపోతున్నారు. గంటలకొద్దీ స్క్రీన్‌లపై గడిపితే ముఖ్యంగా పిల్లల్లో గుండె జబ్బుల ముప్పు పెరుగుతుందని డెన్మార్క్‌లోని కోపెన్ హెగెన్ వర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. 'జర్నల్ ఆఫ్ అమెరికన్ హార్ట్ అసోసియేషన్' కథనం ప్రకారం, కార్డియోమెట బాలిక్ వ్యాధులకు దారితీసే అంశాలకు, స్క్రీన్ టైమ్‌కు మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించేందుకు వెయ్యిమంది పిల్లలపై సైంటిస్టులు అధ్యయనం చేపట్టారు. 10 ఏండ్లు, 18 ఏండ్ల పిల్లల స్క్రీన్ టైమ్, నిద్ర తీరులను పరిశీలించారు. 'ఎలక్ట్రానిక్ పరికరాలతో అధిక సమయం గడుపుతున్న పిల్లలు, టీనేజర్లలో కార్డియోమెటబాలిక్ వ్యాధులు వస్తున్నాయి. అధిక బీపీ, అధిక కొవ్వు, ఇన్సులిన్ నిరోధకత వంటివి తలెత్తే అవకాశముంది' అని నివేదిక పేర్కొన్నది. రోజువారీ స్క్రీన్ సమయం ప్రతి అదనపు గంట వ్యాధి ప్రమాదాన్ని పెంచుతున్నదని నివేదిక తెలిపింది.

## రైతు భీమా కొరకు దరఖాస్తు చేసుకోండి

### వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ

కమాన్ పూర్ : కమాన్ పూర్ మండల పరిధిలోని అర్హత గల రైతులు రైతు భీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ కోరారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు జూన్ 5 వరకు వచ్చిన గతంలో రైతు బీమా చేసుకొని రైతులు మాత్రమే దరహాసు చేసుకోవాలని కోరారు. రైతు బీమా దరఖాస్తు కొరకు కావాల్సినవి ఈ విధంగా ఉన్నాయి దరఖాస్తు ఫారం పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ రైతు ఆధార్ జిరాక్స్ నామిని ఆధార్ జిరాక్స్ పూర్తి చేసి అందజేయాలని పేర్కొన్నారు. దీనికి అర్హత కలుగు రైతులు 14 ఆగస్టు 1966 నుండి 14 ఆగస్టు 2007 వరకు మధ్యలో పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇట్టి దరఖాస్తుల స్థానిక కార్యాలయంలో లేక రైతు వేదికల్లో అందజేయాల్సిందిగా కోరారు.

# టమోటాకు తెగుళ్లు!



**- వర్షాల రాకతో తెగుళ్ల ఉధృతి**

**- కళ్యాణదుర్గం డివిజన్‌లో 15వేల ఎకరాలు సాగు**


కళ్యాణదుర్గం : అనంతపురం జిల్లాలో టమోటా రైతులను తెగుళ్ల కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రస్తుతం టమోటా ధర ఆశాజనకంగా ఉన్నా తెగుళ్లతో రైతులు కుదేలవుతున్నారు. పంట సాగు ప్రారంభం నుంచి వేలాది రూపాయల పెట్టుబడులను ఖర్చు చేశారు. తీరా కోత సమయానికి టమోటా కాయలకు మచ్చతెగుళ్లు రావడంతో పంట ఎందుకూ పనికి రాకుండా పోతోంది. ఈ మచ్చతెగుళ్లతో 70 శాతం పంట నష్టం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మచ్చతెగుళ్ల సోకిన కాయలను వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. పండిన పంటలో 70 శాతం కాయలకు ఈ తెగుళ్లు ఉండడంతో రైతులకు కనీసం పెట్టు బడులకు కూడా వెనక్కు రావడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ తెగుళ్ల ఉధృతి మరింత ఎక్కువ అవుతోంది.

కళ్యాణదుర్గం డివిజన్‌లో అత్యధికంగా సాగు: పండ్ల తోటల సాగులో అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం డివిజన్ రైతులు ముందు వరుసలో ఉన్నారు. టమోటా పంట జిల్లా వ్యాప్తంగా 10 డివిజన్‌లలో 18,750 ఎకరాలలో సాగైంది. ఇందులో సుమారు 15,220 ఎకరాలు కళ్యాణదుర్గం డివిజన్‌లోని ఆరు మండ లాల్లో సాగు జరిగినట్లు జిల్లా ఉద్యానవన అధికారులు చెబుతున్నారు.

ధరా ఆశాజనకంగా ఉన్నా నష్టమే..: ప్రస్తుతం దిగుబడి అందుతున్న టమోట 15కిలోల బాక్సు రూ.300 నుంచి రూ.500 వరకు ధర పలుకుతోంది. మచ్చతెగుళ్లు లేని కాయలు నాణ్యతగా ఉంటే బాక్సు రూ.500 తగ్గకుండా ధర వస్తోంది. ధర బాగా ఉండడంతో రైతులు ఆనంద పడ్డారు. మచ్చతెగుళ్లు రావడంతో ఒక్కసారిగా రైతుల ఆశలు ఆవిరయ్యాయి. మచ్చ తెగుళ్లు ఉన్న కాయలను వ్యాపారులు కొనేందుకు కూడా ముందుకు రావడం లేదు. కళ్యాణదుర్గం మార్కెట్, అనంతపురం, కడప, బెంగళూరు, హైదరాబాదు, కోలార్ పట్టణానికి టమోటాను రైతులు తరలించి అమ్మకాలు చేస్తున్నారు.

అంతదూరం రవాణా ఛార్జీలు, కూలీల ఖర్చులు పోను రైతులకు నామమాత్రపు ఆదాయమే లభిస్తోంది. ఎలాంటి తెగుళ్లు రాకుంటే 15 కిలోల బాక్సులు ఒకఎకరాకు వెయ్యిదాక దక్కుతాయి. ప్రస్తుత రేటు ప్రకారం సరాసరి బాక్సుధర రూ.350 వేసుకున్నా ఎకరాకు రూ.3లక్షలకు పైగానే ఆదాయం వస్తుంది. మచ్చతెగుళ్లు కారణంగా 70 శాతం పంటను వ్యాపారులు బయట పడేయడంతో రూ.70 వేలకు మించి రైతుకు రావడం లేదు.

# ఉత్తరాంధ్రపై కూటమి ఫోకస్



విశాఖపట్టణం,: చంద్రబాబు– పవన్ ఫోకస్ అక్కడే. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అమరావతి జపం చేశారని ఉత్తరాంధ్రని విస్మరించారని విమర్శలు ఉన్నాయి. ఏపీలో టీడీపీ కూటమి నేతలు ఉత్తరాంధ్ర మీద పూర్తి ఫోకస్ పెట్టేశారు అందుకే వరుసగా పర్యటనకు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఒకరి తరువాత ఒకరు ఉత్తరాంధ్రాకు వస్తూనే ఉన్నారు. చంద్రబాబు విషయమే తీసుకుంటే గత నెల 29న వచ్చి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న బాబు సెప్టెంబర్ 2న మరోసారి విశాఖ వచ్చి స్థానిక అధికార కార్యక్రమాల్లో పాల్గొన్నారు తిరిగి ఈ నెల 5న ఆయన విశాఖ వస్తున్నారు. ఒక వారంలో మూడు సార్లు బాబు రావడం అంటే రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అయితే గత నేల చివరిలో నాలుగు రోజుల పాటు విశాఖలో ఉన్నారు ఆయన జనసేన పార్టీ సమావేశాలను నిర్వహించారు బహిరంగ సభతో ఆయన విశాఖ జనాలను పలకరించారు. తిరిగి పవన్ కళ్యాణ్ ఈ నెల 5న విశాఖ వెళ్లారు ఆయన అల్లూరి జిల్లా అరకులోని గిరిన ప్రాంతాలలో పర్యటన చేస్తున్నారు. ఆదివాసీల పండుగలో ఆయన పాల్గొంటారు అని అంటున్నారు. నారా లోకేష్ కూడా గత నెలలో మూడు రోజుల పాటు విశాఖలో ఉంటూ స్థానికంగా ప్రభుత్వ ప్రైవేటు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆయన ఢిల్లీ పర్యటన తరువాత వచ్చే వారంలో విశాఖకు వస్తారని అంటున్నారు. కూటమిలోని ముగ్గురు అగ్ర నాయకులు విశాఖతో పాటు ఉత్తరాంధ్ర మీద దృష్టి పెట్టడానికి కారణం ఈ ప్రాంతాన్ని తాము విస్మరించడం లేదని బలంగా చెప్పడానికే అని అంటున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అమరావతి జపం చేశారని ఉత్తరాంధ్రని విస్మరించారని విమర్శలు ఉన్నాయి. దానిని వైసీపీ కూడా హైలెట్ చేసింది. దాంతో 2019 ఎన్నికల్లో టీడీపీ బాగా దెబ్బ తిన్నది. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాజధాని విశాఖ అని ప్రకటించింది కానీ అమలు చేయలేకపోయింది. విశాఖ వాసులతో పాటు ఉత్తరాంధ్ర ప్రజలు రాజధాని అమరావతిగా ఉండడానికి సమ్మతి తెలిపినా తమ ప్రాంతం కూడా అభివృద్ధి చెందాలని తీవ్రంగా కోరుకుంటున్నారు. ఈ విషయంలో ఎలాంటి రాజీ అయితే లేదని అంటున్నారు. ఇపుడు చూస్తే అమరావతి చుట్టూనే కూటమి ప్రభుత్వం ఆలోచనలు ఎక్కువగా తిరుగుతున్నాయని వైసీపీ విమర్శిస్తోంది. తాజాగా వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ మీడియాతో మాట్లాడుతూ విశాఖలో ఈవెంట్లు అమరవతిలో పేమెంట్లు అని హాట్ కామెంట్స్ చేశారు. విశాఖను కేవలం వాడుకుని వదిలేస్తున్నారు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుశా ఇలాంటి విమర్శలు కూడా కూటమిని ఆలోచనల్లో పడవేసి ఉంటాయని అంటున్నారు అందుకే ఉత్తరాంధ్రాను తాము ఎంతగానో అభివృద్ధి చేస్తున్నామని చెప్పడానికి వరసగా పర్యటనలు చేయడమే కాకుండా ఎవరో ఒకరు తరచూ అధికారిక పర్యటనలతో ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా జనాలలో ఉండేలా చేసుకుంటున్నారు అని అంటున్నారు.

# ఆర్మీ జడ్జి అడ్వకేట్ నియామకాల్లో లింగవివక్ష!


**కేవలం పురుషులకే అన్న నిబంధనపై ఆగ్రహం**

**తీవ్రంగా పరిగణించిన సుప్రీం కోర్టు**



న్యూఢిల్లీ: భారత సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ బ్రాంచి పోస్టుల్లో నియామకాల కోసం అనుసరిస్తున్న 2:1 రిజర్వేషన్ నిష్పత్తి విధానం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. కేవలం పురుషులకే వీటిని రిజర్వ్ చేయడాన్ని సుప్రీం తప్పు పట్టింది. ప్రస్తుత విధానాన్ని అమలు చేయకూడదని తేల్చి చెప్పింది. మహిళలపై పరిమితి పెట్టి ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయకూడదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం జరిగిన పరీక్షల్లో అష్నూర్ కౌర్, ఆస్థ త్యాగీ అనే మహిళా అధికారులు వరుసగా 4, 5వ ర్యాంకులు సాధించారు. అయినప్పటికీ వీరిని విధుల్లోకి తీసుకోకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పురుష అభ్యర్థులకన్నా తమకు మెరిట్ ఎక్కువగా ఉన్నప్పటికీ.. మహిళల కోటాల్లో ఖాళీలు లేవంటూ తమను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి పిటిషన్‌పై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం అప్పుడు తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఈ అంశంపై తీర్పు వెలువరించిన సుప్రీం ధర్మాసనం.. ఆర్మీ ఉన్నతాధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఈ విభాగంలో పురుషులకు 6.. మహిళలకు 3 పోస్టులు కేటాయించాలని నిష్పత్తి పెట్టడం ఏకపక్ష నిర్ణయం. లింగ తటస్థతకు నిజమైన అర్థం.. స్త్రీ, పురుష భేదం లేకుండా అత్యంత ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేయడమే. అంతేగానీ, ఇలా మహిళలకు సీట్లను పరిమితం చేయడం సమానత్వ హక్కును ఉల్లంఘించడమే అవుతుంది. మహిళలపై పరిమితి పెట్టి.. ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయడం సమంజసం కాదని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఇలాంటి విధానాలను అనుసరిస్తే ఏ దేశం భద్రంగా ఉండబోదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇకపై సమానత్వ పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియలో భాగంగా స్త్రీ, పురుష అభ్యర్థుల మెరిట్ జాబితాను బహిర్గతం చేయాలని సూచించింది.

# డ్రోన్స్ సాయంతో ట్రాఫిక్ కంట్రోల్




విజయవాడ: విజయవాడ ట్రాఫిక్ పోలీస్ శాఖ టెక్నాలజీని వినియోగించడంలో మరో దశలోకి ప్రవేశించింది. ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా నగర ట్రాఫిక్ విభాగానికి ఆధునిక పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన 14 డ్రోన్లు, 350 బ్యాటన్ లైట్లు, 720 పోలీస్ క్యాప్స్ అధికారికంగా అందజేశారు. తర్వాత 40 కొత్త ట్రాఫిక్ పాట్రోల్ వాహనాలకు పచ్చజెండా ఊపి సేవలోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీజీపీ గుప్తా మాట్లాడుతూ, విజయవాడ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ, హెల్మెట్ డ్రైవ్స్, శాంతి భద్రతల పరిరక్షణలో అత్యుత్తమంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ట్రాఫిక్ సిబ్బంది ఎండ, వర్షం, కాలుష్యానికి లోనై సమర్పణతో పనిచేస్తున్న తత్వాన్ని గుర్తించి, వారి సేవలను ప్రశంసించాల్సిందే అన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో టెక్నాలజీ ప్రాముఖ్యత.. విజయవాడ పోలీసులు ఆధునిక సాంకేతికతను సమర్ధవంతంగా వినియోగిస్తూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నారని, నేర నిరోధంలో, ట్రాఫిక్ నియంత్రణలో టెక్నాలజీ ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఆయన డ్రోన్ల పనితీరును స్వయంగా తనిఖీ చేశారు. విజయవాడ నగరం ఇప్పటికే "అస్త్రామ్" అనే ఎఆర్ ఆధారిత వ్యవస్థను విజయవంతంగా ప్రయోగించిందని, విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దాన్ని వినియోగించారని వివరించారు. ఈ విజయవంతమైన మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు. విజయవాడ తరహా ఇతర నగరాల్లోనూ త్వరలో.. ప్రతి పోలీస్ స్టేషన్‌లో కనీసం ఒక డ్రోన్ ఉండేలా చర్యలు తీసుకున్నామని, అత్యవసర పరిస్థితుల్లో వీటిని నిఘా,రక్షణకోసం వినియోగిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు తెలిపారు. సీసీటీవీలు, డ్రోన్లు, ఇతర ఆధునిక పరికరాలను విరాళంగా అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. టెక్నాలజీద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలు,నేరగాళ్లను వేగంగా గుర్తించగలుగుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ శాఖకుసంబంధించిన దృక్పథం మారిందని, ప్రజల భద్రతకు టెక్నాలజీ సహకారంతో మరింత సమర్థవంతంగా స్పందించగలుగు తున్నామని అధికారులు పేర్కొన్నారు. విజయవాడ తరహా మోడల్‌ను రాష్ట్రంలోని ఇతర నగరాల్లోనూ త్వరలో అమలు చేయనున్నట్టు తెలుస్తోంది.

# గ్రీన్ చానల్, అంబులెన్స్, కోసం సిగ్నలింగ్

హైదరాబాద్, : హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని దష్టిలో పెట్టుకుని... అంబులెన్సులు, అత్యవసర సేవలు, ప్రముఖుల వాహనాల కోసం ప్రత్యేక సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు జీహెచ్ఎం సీ కసరత్తు చేస్తోంది. ఆయా వాహనాలు సిగ్నల్‌కి సమీపింలోకి రాగానే.. ఆటోమేటిక్‌గా గ్రీన్ సిగ్నల్ పడేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఈ నూతన విధానం వల్ల సీఎం, మంత్రులు, గ్రీన్ చానెల్ వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుకోక్కుండా వేగంగా వెళ్లిపోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా అంబులెన్స్‌లకు ఈ నూతన విధానం ఎంతో మేలు చేస్తుందని భావిస్తున్నారు. భాగ్యనగరంలో ట్రాఫిక్ రద్దీ గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. ఉదయం 7 గంటల ప్రాంతం నుంచి రాత్రి 9 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. సీఎం, మంత్రులు వంటి ప్రముఖులు వస్తుంటే.. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను ఆపేసి.. వారికి దారి ఇస్తారు. అదే అంబులెన్స్‌లు వస్తే.. ట్రాఫిక్ వాళ్లు రూట్ క్లియర్ చేయరు.. జనాలు కూడా మాకేంటి.. మేం ముందుగా వెళ్లాలి అన్నట్లు అలానే ఉంటారుమనం చేసే చిన్న ఆలస్యం.. అంబులెన్స్‌లో ఉన్న వారి ప్రాణాలకు పెను ప్రమాదంగా మారే అవకాశం ఉంది. అయితే అంబులెన్స్‌లకు దారి ఇవ్వడం అనే అంశంపై చాలా మంది వాటికి ప్రత్యేకంగా రోడ్డు లేదా.. సైరన్ సౌండ్ విని.. అవి వెళ్లడానికి అనుమతిస్తే బాగుంటుంద ని అభిప్రాయపడుతుంటారు. ఇక తాజాగా గ్రేటర్ అధికారులు కూడా ఇదే ఆలోచన అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.గ్రీన్ చానల్, అంబులెన్స్ , అత్యవసర సేవలు అలానే ప్రముఖుల వాహనాల కోసం జీహెచ్ఎంసీ అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడానికి కసరత్తు ప్రారంభించింది. ఈ వెహికల్స్ ప్రాధాన్య క్రమంలో మానవ ప్రమేయం లేకుండానే కూడళ్ల వద్ద నిలిచిపోకుం డా.. ముందుకు సాగిపోయేలా సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. త్వరలో ప్రకటించనున్న టెండర్ నోటిఫికేషన్లో ఈ ప్రత్యేక సదుపాయం కల్పించాలని భావిస్తున్నారు. హైదరాబాద్ పరిధిలోని సిగ్నళ్ల నిర్వహణ కాంట్రాక్టు గడువు సెప్టెంబ రు 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త సిగ్నళ్ల ఏర్పాటు తో పాటుగా ఉన్న వాటి నిర్వహణ కోసం త్వరలో టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. ఒక్కో సారి 25 చొప్పున 50 కొత్త సిగ్నళ్లను ఏర్పాటు చేయడమే కాక.. ఇప్పటికే ఉన్న 404 సిగ్నళ్ల నాలుగేళ్ల నిర్వహణకు రూ.70 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు పర్యవేక్షణ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటుకు సంబంధించి బుధవారం జీహెచ్ఎంసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 14వ తేదీ వరకు ఆసక్తి ఉన్న సంస్థలు తమ ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది.ఈ నూతన విధానం వల్ల సీఎం, మంత్రులు, గ్రీన్ చానెల్ వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుకోక్కుండా వేగంగా వెళ్లిపోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా అంబులెన్స్‌లకు ఈ నూతన విధానం ఎంతో మేలు చేస్తుందని భావిస్తున్నారు. భాగ్యనగరంలో ట్రాఫిక్ రద్దీ గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది.ఉదయం 7 గంటల ప్రాంతం నుంచి రాత్రి 9 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. సీఎం, మంత్రులు వంటి ప్రముఖులు వస్తుంటే.. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను ఆపేసి.. వారికి దారి ఇస్తారు. అదే అంబులెన్స్‌లు వస్తే.. ట్రాఫిక్ వాళ్లు రూట్ క్లియర్ చేయరు..జనాలు కూడామాకేంటి..మేం ముందు గా వెళ్లాలి అన్నట్లు అలానే ఉంటారుమనం చేసే చిన్న ఆలస్యం.. అంబులెన్స్‌లో ఉన్న వారి ప్రాణాలకు పెను ప్రమాదంగా మారే అవకాశం ఉంది. అయితే అంబులెన్స్‌లకు దారి ఇవ్వడం అనే అంశంపై చాలామంది వాటికి ప్రత్యేకంగా రోడ్డు లేదా.. సైరన్ సౌండ్ విని.. అవి వెళ్లడానికి అనుమతిస్తే బాగుంటుందని అభిప్రాయపడు తుంటారు. ఇక తాజాగా గ్రేటర్ అధికారులు కూడా ఇదే ఆలోచన అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.గ్రీన్ చానల్, అంబులెన్స్ , అత్యవసర సేవలు అలానే ప్రముఖుల వాహనాల కోసం జీహెచ్ఎంసీ అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడానికి కసరత్తు ప్రారంభించింది. ఈ వెహికల్స్ ప్రాధాన్య క్రమంలో మానవ ప్రమేయం లేకుండానే కూడళ్ల వద్ద నిలిచిపోకుండా.. ముందుకు సాగిపోయేలా సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. త్వరలో ప్రకటించనున్న టెండర్ నోటిఫికేషన్లో ఈ ప్రత్యేక సదుపాయం కల్పించాలని భావిస్తున్నారు.హైదరాబాద్ పరిధిలోని సిగ్నళ్ల నిర్వహణ కాంట్రాక్టు గడువు సెప్టెంబరు 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త సిగ్నళ్ల ఏర్పాటుతో పాటుగా ఉన్న వాటి నిర్వహణ కోసం త్వరలో టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. ఒక్కో సారి 25 చొప్పున 50 కొత్త సిగ్నళ్లను ఏర్పాటు చేయడమే కాక.. ఇప్పటికే ఉన్న 404 సిగ్నళ్ల నాలుగేళ్ల నిర్వహణకు రూ.70 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు పర్యవేక్షణ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటుకు సంబంధించి జీహెచ్ఎంసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 14వ తేదీ వరకు ఆసక్తి ఉన్న సంస్థలు తమ ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది.నూతనంగా ప్రవేశపెట్టబోయే సిగ్నలింగ్ వ్యవస్థలో అంబులెన్స్‌లను, అత్యసవర సేవలందించే, ప్రముఖుల కాన్వాయ్‌లు వచ్చే సమయంలో గ్రీన్ సిగ్నల్ దానంతట అది పడేలా నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. ఇందుకోసం ఆయా వాహనం/ వాహనాల నంబర్లు, ఏ మార్గంలో వెళ్తాయన్నదానికి సంబంధించిన సమాచారాన్ని బయలుదేరడానికి ముందే ట్రాఫిక్ పోలీస్ అధికారులకు అందించాలి. అప్పుడు వారుఈ వివరాలను ఐసీసీసీకి పంపుతారు.

# బీసీల వైపే దేశం దృష్టి..

జయశంకర్ భూపాలపల్లి: దేశవ్యాప్తంగా కోరుకున్నట్లుగానే మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం వచ్చే సంవత్సరం 2026 నుండి దేశవ్యాప్తంగా కులగణన చేయడానికి ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామని, కులగణన జరిగిన తర్వాత జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లను కల్పిస్తామని బీసీలకు హామీ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2026లో నిర్వహించబోయే కులగణనలో చేపట్టే విధివిధానాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ఎన్నికల ముందు హామీనిచ్చినట్టుగానే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వచ్చి..రాష్ట్రంలో కులగణన చేపట్టి..బీసీలకు 42 శాతం విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో రిజర్వేషన్లను కల్పించేందుకు బీసీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి..ఆ బిల్లుకు ఆమోదం తెలిపి..గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపిస్తే..మూడు నెలల్లో ఆ బిల్లుపై నిర్ణయం తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం బీసీల పట్ల వ్యతిరేక వైఖరిని అవలంబిస్తుందని మండిపడ్డారు.10 శాతం ఉన్న అగ్రవర్ణాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయవచ్చు. కానీ..జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు స్థానికంగా 42 శాతం రిజర్వేషన్లను పొందకూడదా..? అని మహేందర్ గౌడ్ బిజెపి నాయకులను నిలదీశారు. హిందుత్వం ముసుగులో వంటకాగుతూ..అగ్రవర్ణాలకు, బ్రాహ్మణులకు దేశ సంపదను దోచిపెడుతున్నారని ఘాటుగా విమర్శించారు. బీసీల్లో ఉత్పత్తి కులాలు..సేవా కులాలు ఉన్నాయని, దేశంలోని 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాలు దేశ సంపదను సృష్టిస్తే..ఆ సంపదనంతా 10 శాతం ఉన్న అగ్రవర్ణాలకు దోచిపెడుతున్న ప్రభుత్వాల భరతం పడతామని మహేందర్ గౌడ్ హెచ్చరించారు. మా సోదరులు ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అది జరగాల్సిందే..చివరకు అగ్రవర్ణాలకు కూడా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు కానీ సామాజిక వర్గం ఏదైనా ఉందంటే అది బీసీ లేనని..మరీబీసీలు చేసిన పాపం ఏంటని..? ఆయన పాలకులను నిలదీశారు. బీసీలుగా పుట్టడమే మా శాపమా..? ఈ అగ్రవర్ణ పార్టీలు, పాలకులకు ఓట్లు వేయడమే మేము చేసుకున్న పాపమా..? ఇదెక్కడి న్యాయం..అందరికీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు..బీసీలకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. బీసీల సమాగ్రాభివృద్ధిని..దేశాభివృద్ధిగా చూసినట్లయితే రాష్ట్రంలో, దేశంలో 60 శాతం జనాభా ఉన్నటువంటి బీసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినప్పుడే దేశం స్వర్ణ భారత్..అఖండ భారత్ గా విరాజిల్లుతుందన్నారు.

# బీసీలపై ఒక్కసారి ప్రేమ..!

హైదరాబాద్, : కుల రాజకీయాలు బాగా పెరిగిపోయాయి కాబట్టి ఓసీల్లో కూడా ఫలానా కులంవారి ఓట్లు ఎన్ని ఉన్నాయి, బీసీల్లో ఫలానా వర్గం వారి ఓట్లు ఎన్ని ఉన్నాయనే లెక్కలు బయటకు తీసిమరీ గెలుపు లెక్కలు వేసుకుంటారు నాయకులు. ఈ లెక్కలు ఎలాఉన్నా.. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో బీసీలకు మెజార్టీ ఓట్లు ఉంటాయి. గంపగుత్తగా బీసీ ఓట్లు కొల్లగొడితే చాలు ఆ అభ్యర్థి విజయం గ్యారెంటీ. కానీ అది అసాధ్యం అని అందరికీ తెలుసు. అందుకే ఒక్కోసారి ఒక్కో రకంగా బీసీలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తుంటాయి రాజకీయ పార్టీలు. తెలంగాణలో బీసీ రాజకీయాలు.. తెలంగాణకు ఒక ఎస్సీని తొలి ముఖ్యమంత్రిగా చేస్తామని చెప్పి అప్పట్లో ఆ సామాజిక వర్గానికి మరింత దగ్గరయ్యారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. కానీ పార్టీ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ ఎన్ని పిల్లిమొగ్గలు వేశారో అందరికీ తెలుసు. ఇక అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు ఆ పార్టీ చేసింది శూన్యం అనే చెప్పాలి. కాంగ్రెస్ విషయాని కొస్తే.. అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపట్టి అతి పెద్ద సాహసం చేసింది కాంగ్రెస్. అంతే కాదు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి, కేంద్రానికి పంపించారు సీఎం రేవంత్ రెడ్డి. అక్కడితో కథ సుఖాంతం కాలేదు. ఆ రిజర్వేషన్లకు కేంద్రం మోకాలడ్డింది. దీంతో మళ్లీ గొడవ మొదలైంది. బీసీలకోసం పాటుపడేది మేమంటే మేమంటూ అన్ని పార్టీలూ చెప్పుకుంటున్నాయి. అదే సమయంలో బీసీలకు అన్యాయం చేస్తోంది మీరంటే మీరంటూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు నేతలు. కాంగ్రెస్ పాత్ర ఏంటి..? బీసీ రిజర్వేషన్ బిల్లుని అసెంబ్లీలోఆమోదింపజేసి కేంద్రానికి పంపించింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆ రిజర్వేషన్ పై రాష్ట్రపతి ఆమోద ముద్ర వేస్తే చట్టం చెల్లుబాటవుతుంది. కానీ రాష్ట్రపతి కేంద్రం అనుమ తితోనే ఆ పనిచేయాలి, అంటే ఇక్కడ కేంద్రానికి బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచడం ఇష్టం లేదని చెప్పాలి. దీంతో కాంగ్రెస్ పోరుబాటకు సిద్ధమైంది. అవసరమైతే ఢిల్లీలో ధర్నాకు దిగుతామని హెచ్చరించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈలోగా తెలంగాణలో స్థానిక ఎన్నికలు రాబోతుండటంతో తమ పార్టీ తరపున బీసీలకు 42శాతం సీట్లు కేటాయించడానికి ఆయన సిద్ధమవుతున్నారు. అదే జరిగితే, బీసీల ఓట్లు కాంగ్రెస్ వైపు మరలుతాయనడంలో సందేహం లేదు. బీజేపీ ఏమంటోంది? బీసీ బిల్లుని అడ్డుకుంటున్నారన్న అపవాదు బీజేపీపై ఉంది. అయితే తెలివిగా ఆ పార్టీ తప్పించుకోవాలని చూస్తోం ది. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లు ప్రకారం 42 శాతంలో ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు కలిపే ఉన్నాయని, కేవలం బీసీలకు 32శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలవుతాయని అంటున్నారు బీజేపీ నేతలు. అందుకే తాము ఆ బిల్లుని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ముస్లింలకు కేటాయించిన 10శాతం రిజర్వేష్లు తీసేసి కేవలం బీసీలకే 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తే వెంటనే ఆ బిల్లుకి ఆమోద ముద్ర వేయిస్తామని అంటున్నారు. మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం అంటున్న బీజేపీ, బీసీలపై ప్రేమ చూపిస్తున్నట్టుగా కలరింగ్ ఇస్తోంది. బీఆర్ఎస్ వాదన ఏంటి? బీసీ రిజర్వేషన్ బిల్లు విషయంలో బీఆర్ఎస్ సందిగ్ధంలో ఉంది.కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని, బీజేపీబిల్లు ఆమోదానికి అడ్డుపడుతోందని అంటోంది బీఆర్ఎస్. తమ హయాంలో బీసీ రిజర్వేషన్ గురించి ఎందుకు ఆలోచించలేదనే ప్రశ్న వస్తే మాత్రం సమాధానం చెప్పడానికి బీఆర్ఎస్ నేతలు తడబ డుతున్నారు. బీసీ గర్జన అంటూ హడావిడి చేశారు కానీ, చివరకు చప్పబడ్డారు. కొత్తగా కవిత బీసీ రాగం అందుకోవడం కూడా పరోక్షం గా బీఆర్ఎస్ ని ఇరుకునపెడుతోంది. బీఆర్ఎస్ 9 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు పూలే విగ్రహం ఊసే ఎత్తని కవిత, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీ నాయకుల విగ్రహాలంటూ హడావిడి చేయడం హాస్యాస్పదంగా మారింది. ఇక బీసీ బిల్లు విషయంలో కవిత కాంగ్రెస్ ని సమర్థిస్తున్నా.. అది చట్టంగా మారకపోవడంలో ఆ పార్టీ ఉదాసీనత కూడా ఉందని అంటోంది. మూడు పార్టీల్లో ఎవరికి బీసీలపై ఎక్కువ ప్రేమ ఉంది, ఎవరిది కపట ప్రేమ అని చెప్పడం కాస్త కష్టమే. కానీ అన్ని పార్టీలకు బీసీలఓట్లు మాత్రం కావాలి, వాటి ద్వారా వచ్చే ప్రతిఫలాన్ని అనుభవించాలి అని ఉంటుంది. అయితే ఇక్కడ కాంగ్రెస్ ముందడుగు వేయడం మిగతా పార్టీలకు ఇబ్బందిగా మారింది. బీసీ బిల్లు చట్టంగా మారితే కచ్చితంగాఅది కాంగ్రెస్ ఘనతే అవుతుంది. రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్అన్నీ తానై చేసినా.. తెలంగాణలో 9 ఏళ్లు అధికారానికి దూరం కావాల్సి వచ్చింది. ఇటు ఏపీలో పార్టీ పూర్తిగా శవాసనం నుంచి కదలనంటోం ది. బీసీ బిల్లు విషయంలో అయినా క్రెడిట్ తీసుకోవడంలో కాంగ్రెస్ ముందుంటుందో లేక వెనకబడుతుందో చూడాలి.

# వైజాగ్ లో పేకాట క్వీన్స్



విశాఖపట్టణం, : కాలం మారిపోయింది. ఎన్నో రకాల రుగ్మతలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయి. ముఖ్యంగా మానవ తప్పిదాలు పెరుగుతున్నాయి. జూదమాటలతో పాటు వ్యసనాల బారిన ఎక్కువ మంది పడుతున్నారు. అయితే ఇప్పుడు మహిళలు కూడా వ్యసనాల బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. విశాఖపట్నంలోజూదం ఆడుతూ ఆరుగురు మహిళలు పోలీసులకు పట్టుబడటం విశేషం. ఇప్పటివరకు పురుషులే జూద మాటలు ఆడడం చూస్తుంటాం. కానీ ఇప్పుడుమహిళలు సైతం అనుసరించడం ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఓ భర్త, ఇంట్లో భార్య రోజూ బయటకు వెళ్లి రావడాన్ని గమనిస్తూ, పేకాట ఆడుతోందని అనుమానంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మొదట్లో స్థానిక పోలీసు స్టేషన్లో అతని ఫిర్యాదును పట్టించుకోకపోయినా, పైఅధికారి స్థాయిలోచెప్పడంతో వ్యవహారం ఊహించని మలుపు తిరిగింది. చివరకు పోలీసుల దాడిలో అసలు గుట్టు వెలుగులోకి వచ్చింది. పట్టుబడిన వారు ఎవరూ ఊహించని విధంగా మహిళలు కావటం, అంతా ఒకే ప్రాంతంలో కూర్చుని పేకాట ఆడుతుండటం స్థానికులను ఆశ్చర్యకితులను చేసింది. గుట్టు చప్పుడు కాకుండా? గుట్టు రట్టు విశాఖలోని ఒక నివాస భవనం పేకాట ‘అడ్డా’గా మారింది. నిత్యం పేకాట ఆడుతున్న ఆరుగురు మహిళలు లలిత నగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో రొటీన్‌గా జూదంలో మునిగిపోయారు. అయితే మామూలుగా ఎవరికీ అనుమానం రాకుండా వ్యవహరిస్తూ వస్తుండగా, భర్త తన భార్యపై పెట్టిన అనుమానం పోలీసులకు ఫిర్యాదుగా మారింది. టాస్క్ ఫోర్స్‌రంగంలోకి.. ఆరుగురు మహిళలు అదుపులోకి భర్త ఫిర్యాదుతర్వాత నగరంలోని టాస్క్ ఫోర్స్ పోలీసులు సీక్రెట్‌గా సమాచారం సేకరించి, లలిత నగర్‌లో ఆ ఇంటిపై దాడి చేశారు. సరిగ్గా అందరూ ఆటలో ఉండగా.. పోలీసులు అక్కడికి చేరుకొని ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.22,000నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు, దర్యాప్తు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇప్పటివరకు ఆ మహిళల వివరాలు సేకరించి, స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. అంతే కాకుండా, ఈ గృహం ఎవరిది? ఇలాంటివే ఇంకెన్ని ఉన్నాయన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. పట్టుబడిన మహిళలు సంతానం తో ఉన్న గృహిణులు కావటం, ఆర్థిక అవసరాలు లేదా మోజు కారణంగా ఇలా జరిగిందా అన్నదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇంటి తలుపులు మూసుకుని.. పేకాటలో మునిగిన రాణులు ఈ ఘటన వెలుగులోకి రావడంతో ఆ ప్రాంత ప్రజలలో ఆందోళన నెల కొంది. ఇక్కడ ఇలాంటి పనులు జరుగుతున్నాయనేది ఊహించలేదు.. గృహిణులు ఇలాంటివి చేస్తే పిల్లలకు ఏం బుద్ధి వస్తుంది? అంటూ కొంతమంది స్థానికులు మాట్లాడారు. ఇక పట్టుబడిన మహిళల కుటుంబ సభ్యులు మాత్రం మౌనమే వహిస్తున్నారు. ఆడవాళ్లు ఇలాంటివి చేస్తే కుటుంబం నాశనం అవుతుందని కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. విశాఖపట్నం లలితా నగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో మహిళలు గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే నాలుగో పట్టణం పోలీసు లు రంగంలోకి దిగారు.టాస్క్ ఫోర్స్ పోలీసులతో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుంచి 22వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఈ ఘటన కలకలం రేపింది.అయితే ఈ మహిళలు తరచూ వారి ఇళ్లలో పేకాట ఆడుతున్నట్లు తెలుస్తోంది. ఓ అజ్ఞాత వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు రంగంలోకి దిగిఅరెస్టు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఆరుగురు మహిళల్లో ఓ మహిళ భర్త గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఎటువంటి చర్యలు లేకపోవడంతో నేరుగా పోలీసు ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయగా.. వారు యాక్షన్ లోకి దిగినట్లు సమాచారం. లలితా నగర్ ప్రాంతంలో ఒక భవనంలో మినీ పేకాట క్లబ్ నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అక్కడ నిత్యం మహిళలు కనిపిస్తుంటారు. గతంలో ఓసారి మహిళలు పేకాడుతూ పట్టుపడగా పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి విడిచి పెట్టారట.





# బ్యాంకుల పరిధిలోనే మినిమమ్ బ్యాలెన్స్ వ్యవహారం

**ఈ వ్యవహారం ఆర్‌బిఐ పరిధిలో లేదన్న గవర్నర్ మల్హోత్రా**

గాంధీనగర్, : బ్యాంకులో ఖాతాదారుల అకౌంట్స్‌లో మినిమమ్ బ్యాలెన్స్ నిబంధన అన్నది ఆయా బ్యాంకులకున్న స్వేచ్ఛ అని, ఇందులో ఆర్‌బిఐ జోక్యం ఉండదని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. బ్యాంకు ఖాతాల్లోని కనీస నిల్వల అంశంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. మినిమమ్ బ్యాలెన్స్ ఎంత ఉండాలనేది పూర్తిగా బ్యాంకుల నిర్ణయమని చెప్పారు. దీనిపై ఆర్‌బీఐ నియంత్రణ ఏదీ ఉండదని పేర్కొన్నారు. కనీస బ్యాలెన్స్ పరిమితిని ఐసీఐసీఐ బ్యాంక్ గరిష్ఠంగా రూ.50 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్న వేళ గుజరాత్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమం పాల్గొన్న సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ మీడియాతో మాట్లాడారు. కనీస సగటు- బ్యాలెన్స్ ఎంత ఉండాలి అనే నిర్ణయం ఆర్‌బీఐ బ్యాంకులకే వదిలేసింది. కొన్ని బ్యాంకులు రూ.10వేలు నిర్ణయిస్తాయి. మరికొన్ని రూ.2 వేలు ఉంచుతాయి. కొన్ని కనీస బ్యాలెన్స్ నిబంధనను ఎత్తివేశాయి. ఈ అంశం ఆర్‌బీఐ నియంత్రణ పరిధిలోకి రాదని సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ లేనిపక్షంలో విధిస్తున్న అపరాధ రుసుమును ఇటీవల కొన్ని బ్యాంకులు ఎత్తివేస్తుండగా, ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం అందుకు భిన్నంగా ఖాతాదార్లకు షాకిచ్చింది. సేవింగ్స్ అకౌంట్లోల కనీస నిల్వ మొత్తాన్ని భారీగా పెంచేసింది. ఆగస్టు 1 తర్వాత ఖాతా తెరిచిన వారికే ఇది వర్తించనుంది. మెట్రో, అర్బన్ ప్రాంతాల్లో ఖాతాదార్లు కనీసం రూ.50,000 నిల్వ ఉంచాలి. గతంలో ఈ మొత్తం సెమీ అర్బన్ ఖాతాదార్ల కనీస నిల్వ మొత్తాన్ని రూ.5,000 నుంచి రూ.25,000కు, గ్రామీణ ఖాతాదార్లకు రూ.2,500 నుంచి రూ.10,000కు సవరించింది. కనీస నిల్వ లేనిపక్షంలో ఛార్జీలు కనీస నిల్వకు ఎంత తక్కువ మొత్తం ఉంటు-ందో దానిపై 6 శాతం లేదా రూ.500 ఏది తక్కువైతే అది చెల్లించాల్సి ఉంటుందని ఐసీఐసీఐ బ్యాంక్ వెల్లడించింది. అయితే దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# భారతీయుల పిల్లలకు 'గ్రీన్ కార్డ్' బెంగ




న్యూఢిల్లీ: అమెరికా ఇమిగ్రేషన్ నిబంధనలు మారనున్న కారణంగా వేలాది మంది పిల్లలు ముఖ్యంగా భారత్‌కు చెందినవారు స్వదేశాలకు తరలిపోవలసిన ముప్పును ఎదుర్కోనున్నారు. తమ తల్లిదండ్రుల గ్రీన్‌కార్డు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, హెచ్-1బీ వీసాదారుల పిల్లలు 21 సంవత్సరాలు దాటిన మరుక్షణం తమకు ఇప్పటివరకు ఉన్న రక్షిత ఇమిగ్రేషన్ హోదాను కోల్పోయే అవకాశం ఉంది. చైల్డ్ స్టేటస్ ప్రొటెక్షన్ యాక్ట్(సీఎస్‌పీఏ) కింద పిల్లల వయసును లెక్కించే నిబంధనలకు సంబంధించి అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) తాజా సమాచారాన్ని ప్రకటించింది. గ్రీన్ కార్డులు కోరుతూ 2025 ఆగస్టు 15 తర్వాత దాఖలయ్యే దరఖాస్తులకు కొత్త నిబంధనలు వర్తించనున్నాయి. తాజా నిబంధనల కింద సీఎస్‌పీఏ వయసును లెక్కించడానికి వీసా లభ్యత నిర్ధారణ కోసం వీసా బులెటిన్‌లోని ఫైనల్ యాక్షన్ డేట్స్ చార్ట్‌ని యూఎస్‌సీఐఎస్, విదేశాంగ శాఖ కలసి ఉపయోగించుకుంటాయి. గ్రీన్‌కార్డుల కోసం, ఇమిగ్రంట్ వీసా కోసం సమర్పించే దరఖాస్తుల కోసం సీఎస్‌పీఏ వయసును లెక్కించడం జరుగుతుంది. 2023 ఫిబ్రవరిలో బైడెన్ ప్రభుత్వం తీసుకువచ్చిన విధానం ప్రకారం గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే అర్హతను సాధించుకున్న హెచ్-1బీ వీసాదారులకు చెందిన కొందరు పిల్లలకు తమ తల్లిదండ్రులతో పాటే అమెరికాలో నివసించే రక్షణ లభిస్తుంది. గ్రీన్‌కార్డు కోసం తల్లిదండ్రులు వెయిటింగ్‌లో ఉండగా పిల్లల వయసు 21 దాటినప్పటికీ తాము అమెరికాలో నివసించే అర్హతను వారు కోల్పోరు. 21 ఏళ్ల లోపు అవివాహిత వ్యక్తులను పిల్లలుగా ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్ నిర్వచిస్తుంది. కొత్త నిబంధనల ప్రకారం గ్రీన్‌కార్డు కోసం వేచిచూస్తున్న హెచ్-1బీ వీసాదారుల పిల్లలు 21 ఏళ్లు దాటిన తర్వాత అమెరికాలో నివసించే చట్టపర అర్హత కోల్పోతారు.

# గిరిజనులకు అంబేద్కర్ వర్శిటీ ఉచిత విద్య...




హైదరాబాద్, : కొంత మంది ఉన్నత చదువులు చదివి.. పెద్ద ఉద్యోగం చేయాలనే ఆశతో ఉంటారు. కానీ దానికి తగ్గట్లు ఆర్థిక స్థోమత, కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మధ్యలో తమ చదువులు ఆపేసి ఏదో ఒక ఉద్యోగం చేస్తుంటారు. ఇక మహిళలకు అయితే పెళ్లి చేసి.. తమ బాధ్యతలను తీర్చుకుంటారు చాలా మంది తల్లిదండ్రులు. కానీ.. వారికి ఇంకా చదవాలనే కోరిక మాత్రం అలానే ఉండిపోతుంది. అలాంటి వారి కోసం ఓపెన్ విద్య అనేది ఒక వరంలాంటిది. ముఖ్యంగా తెలంగాణలో డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇలాంటి వారి ఎందరో కలలను నెరవేర్చింది. మధ్యలో చదువు ఆపేసిన వారికి.. ఉద్యోగం చేస్తూ చదువుకోవాలనుకునే వారికి వారి కోరికలను తీర్చింది.కొంతమంది ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆశపడతారు. అయితే ఆర్థిక, కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల చాలా మంది తమ చదువులను మధ్యలోనే ఆపేస్తుంటారు. అలాంటి వారిలో మహిళలు, మారుమూల ప్రాంతాల ప్రజలు ఎక్కువగా ఉంటారు. ఇలా చదువుకు దూరమైన వారికి, ఉద్యోగం చేస్తూనే చదువుకోవాలనుకునే వారికి డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ యూనివర్సిటీ ప్రతి సంవత్సరం డిగ్రీ, పీజీ, డిప్లొమా వంటి అనేక కోర్సులకు అడ్మిషన్లు ప్రకటిస్తుంది. ఇప్పుడు.. ఒక కొత్త నిర్ణయంతో ఈ యూనివర్సిటీ మరింత మందికి చేరువ కానుంది.డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఆదివాసీ విద్యార్థులకు ఉచిత విద్య అందించనున్నట్లు ప్రకటించింది. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఈ విషయాన్ని వెల్లడించారు. యూనివర్సిటీ గడిచిన నాలుగు దశాబ్దాలుగా లక్షలాది మందికి ఉన్నత విద్య అందించినా, ఇంకా కొన్ని వర్గాల ప్రజలు చదువుకు దూరంగా ఉన్నారని, అందులో ముఖ్యంగా ఆదివాసీ తెగలు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సమస్యను గుర్తించిన యూనివర్సిటీ, వారికి ఉన్నత విద్యను అందించాలని నిర్ణయించుకుంది.యూనివర్సిటీ నినాదంకు అనుగుణంగా, మారుమూల ప్రాంతాల్లో కూడా స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ.. ఆదివాసీలకు ఇంకా పూర్తిస్థాయిలో చేరువ కాలేకపోయామని యూనివర్సిటీ అధికారులు గుర్తించారు. అందుకే వారికి ఆర్థిక భారం లేకుండా, చదువుకు కావలసిన వనరులు అందించడానికి ఈ ప్రణాళికను రూపొందించారు. ఈ పథకం ప్రకారం.. ఆదివాసీ విద్యార్థులు ఎటువంటి బోధనా రుసుముచెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం రూ.500 నామమాత్రపు అడ్మిషన్ ఫీజుతో వారు డిగ్రీ కోర్సుల్లో చేరవచ్చు. అంతేకాకుండా వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తారు. వసూలు చేసే ఆ డబ్బులు కూడా పుస్తకాల కోసమే అని తెలిపారు. రాష్ట్రంలోని గోండు, కోయ, చెంచు వంటి తెగలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం అండగా నిలుస్తుంది. రాబోయే ఐదేళ్లలో కనీసం వెయ్యి మంది ఆదివాసీ విద్యార్థులను పట్టభద్రులుగా చూడాలని యూనివర్సిటీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రణాళిక వల్ల చదువుకు దూరంగా ఉన్న ఆదివాసీ యువత తమ కలలను సాకారం చేసుకునే అవకాశం లభిస్తుంది. ఇటీవల చదువుతో పాటే.. నెల నెలా స్టైఫండ్ పొందేందుకు ఓ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే.ఈ ప్రణాళికలో చేరడానికి చివరి తేదీ ఆగస్టు 13. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ హెల్ప్ డెస్క్ లేదా వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. 40-23680333 / 040-23680555.. కాల్ సెంటర్ : 1800 5990 101 లేదా వెబ్ సైట్..ను సంప్రదించవచ్చు.

# అడవి తల్లిబాటకు శ్రీకారం

విశాఖపట్టణం, : ఆ ప్రాంతాల ప్రజలు ఎన్నేళ్లుగా ఎదురుచూస్తున్న సౌకర్యం చివరికి వారి గడపకు రానున్న సమయం ఆసన్నమైంది. కొండలు, అడవులు, లోయల మధ్య ఉంటూ రోడ్డు అనే మాట విని కూడా చూడని గిరిజన ఆవాసాల జీవితం ఇక పూర్తిగా మారబోతోంది. ఒక నిర్ణయం, ఒక ప్రణాళిక ఇప్పుడు వారిని అభివృద్ధి దిశగా నడిపించబోతుంది. ఈ ప్రణాళిక పూర్తయ్యే సరికి, ఆ ప్రాంతాల ప్రజలకు ఇది నిజమైన పండుగవలె మారనుంది. ఇంతకు ఆ నిర్ణయం తీసుకున్నది ఎవరో కాదు ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్. 'అడవి తల్లి బాట' రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ గిరిజన ప్రాంతాల్లో రహదారి పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో 'అడవి తల్లి బాట' పేరుతో చేపట్టిన నూతన రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పనులు పూర్తయితే 625 గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం అందనుంది. రూ.1005 కోట్లతో భారీ ప్రాజెక్ట్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పీఎం జన్ మన్ పథకం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉప ప్రణాళిక నిధులు కలిపి మొత్తం రూ. 1005 కోట్లతో చేపట్టబడింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు రహదారి సౌకర్యం లేని ఆవాసాలను కూడా అనుసంధానించేలా రెండు దశల్లో ఈ పనులు కొనసాగుతున్నా యి. సవాళ్లు, అవరోధాలు.. కానీ అడుగులు ఆగవు అధికారులు సమావేశంలో పనుల ప్రస్తుత స్థితి వివరించారు. కొండలపై ఉన్న ఆవాసాలను కలిపే రోడ్లు వేసేందుకు బండరాళ్లను బద్ధలుకొడుతూ ముందుకు సాగడం వల్ల ఎక్కువ సమయం పట్టుతోందని, అలాగే నిటారుగా ఉన్న ప్రాంతాలు కావడంతో సాంకేతిక జాగ్రత్తలు తప్పనిసరని చెప్పారు. ప్రస్తుతం వర్షాల ప్రభావంతో పనుల వేగం కొంత తగ్గిందని, అయితే ప్రయత్నాలు ఆగలేదని తెలిపారు. అటవీ అనుమతుల సమస్య ? పరిష్కారం దిశగా మొత్తం 128 రహదారి మార్గాలు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఉండటంతో అటవీ అనుమతులు అవసరమయ్యాయి. వీటిలో 98 మార్గాలకు ఇప్పటికే అనుమతులు వచ్చాయని అధికారులు చెప్పారు. ఇప్పటివరకు 186 పనులు ప్రారంభమయ్యాయని, మరో 20 పనులు టెండర్ దశలో ఉన్నాయని, టెక్నికల్ ఎవాల్యుయేషన్ ప్రక్రియ జరుగుతోందని వివరించారు. పవన్ కళ్యాణ్ ఏమన్నారంటే? ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం డోలీరహిత గిరిజన ఆవాసాల లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పీఎం జన్ మన్ పథకం ద్వారా రూ.555.6 కోట్లు కేటాయించి సహకరించారని పవన్ అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను కూడా వినియోగిస్తున్నాం. ఇన్ని వనరులు ఉన్నందున 'అడవి తల్లి బాట' పనుల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలి. నిరంతర పర్యవేక్షణతోనే పనులు వేగంగా పూర్తవుతాయి. సవాళ్లు ఎదురైనా ప్రణాళికాబద్ధంగా అధిగమించాలి. అవసరమైతే అటవీ శాఖతో సమీక్ష జరిపి అనుమతులను త్వరగా పొందాలని పేర్కొన్నారు. స్థానికుల భాగస్వామ్యం అవసరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఈ పనుల ప్రాధాన్యతను స్థానికులకు తెలియజేయాలని, తద్వారా వారు కూడా సహకరించేందుకు ముందుకు వస్తారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి రహదారి సౌకర్యం లేని ఆవాసాలు తొలిసారి రోడ్డు పొందుతున్నాయి. ఇది కేవలం రోడ్డు కాదు, అభివృద్ధి దారిలో ఒక మలుపు. ఈ విషయాన్ని ప్రజలకు చెప్పి వారిలో నమ్మకం, ఉత్సాహం కలిగించాలని ఆయన స్పష్టం చేశారు. డోలీరహిత ఆవాసాల లక్ష్యం ఈ ప్రాజెక్ట్ పూర్తయితే గిరిజన ప్రాంతాల వాణిజ్యం, విద్య, వైద్య సౌకర్యాలు అన్ని వేగవంతం అవుతాయి. అటు పర్యాటకానికి, ఇటు స్థానికుల ఆర్థికాభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయి. రవాణా సౌకర్యం లేని కారణంగా ఇప్పటి వరకు పక్కనున్న పట్టణాలకు చేరుకోవడమే కష్టంగా ఉన్న పరిస్థితి, రోడ్లు అందుబాటులోకి రాగానే పూర్తిగామారిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ, సాంకేతిక నాణ్యత, ప్రజల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేయాలని సంకల్పించింది. 'అడవి తల్లి బాట' విజయవంతమైతే, ఇది ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా మారే అవకాశం ఉంది. అభివృద్ధి కాంతి ఇప్పటివరకు తాకని గిరిజన ప్రాంతాల గడప దాటబోతోంది.

## జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం కీలక మలుపు

న్యూఢిల్లీ, : ఇంట్లో నోట్ల కట్టలు లభించిన ఘటనలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ఆయన అభిశంసన కోసం లోక్‌సభ సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని స్పీకర్ ఓం బిర్లా స్వీకరించారు. ఈ ఉదంతంపై విచారణ కోసం ముగ్గురు సభ్యులతో కూడిన ఓ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ప్యానెల్‌లో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు జస్టిస్ ఎమ్ఎమ్ శ్రీవాత్సవ, సీనియర్ న్యాయవాది బీవీ ఆచార్యులు సభ్యులుగా ఉన్నారు. అభిశంసన తీర్మానంపై ప్రతిపక్ష, పాలక పక్షానికి చెందిన 146 మంది సంతకం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ అభిశంసన పక్రియ ప్రారంభం కావాల్సిందేనని అన్నారు. అవినీతికి పార్లమెంటు పూర్తిగా వ్యతిరేకమని చెప్పారు. ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని అన్నారు. ఇక స్పీకర్ ఏర్పాటు- చేసిన కమిటీ ఈ ఉదంతానికి సంబంధించిన సాక్షులు ప్రశ్నించి, ఆధారాలను పరిశీలిస్తుంది. విచారణ అనంతరం, తుది నివేదికను స్పీకర్‌కు సమర్పిస్తుంది. అనంతరం నివేదికను సభ ముందు ఉంచుతారు. ఈ ఉదంతంలో న్యాయమూర్తి దోషిగా తేలిన పక్షంలో ఆయన అభిశంసన తీర్మానంపై ఓటింగ్ జరుగుతుంది. రాజ్యసభలో కూడా ఇదే పక్రియను అమలు చేస్తారు. ఉభయ సభలు ఆమోదించిన తీర్మానానికి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిస్తారు.

# టాటా చేతికి అరకు కాఫీ




విజయనగరం, : అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కేలా ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అంతర్జాతీయ స్థాయిలో ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే కాకుండా.. మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా ప్రతిష్టాత్మక సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది ఏపీ ప్రభుత్వం. ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలో ఈ కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా పాడేరులో జరిగిన కార్యక్రమానికి చంద్రబాబు హాజరైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధికి సంబంధించి ఒప్పందాలు జరిగాయి. ముఖ్యంగా గిరిజనుల జీవనోపాధి, అటవీ ఉత్పత్తుల అమ్మకం, పర్యాటక రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడం వంటి 21 అంశాల్లో ఈ ఒప్పందాలు జరిగాయి. ప్రధానంగా అరకు కాఫీ బ్రాండ్ అంతర్జాతీయంగా విస్తరించేందుకు, మార్కెటింగ్ కోసం దిగ్గజ సంస్థ టాటా కంపెనీ జిసిసి తో ఒప్పందం చేసుకుంది.అరకు కాఫీ ఇప్పటికే అంతర్జాతీయ గుర్తింపు సాధించింది. ఐక్యరాజ్యసమితి నుంచి సైతం ప్రశంసలు అందుకుంది. చింతపల్లి ప్రాంతంలో రెడ్ చెర్రీ రిఫైనింగ్, ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పడానికి సబ్ కో సంస్థ ముందుకొచ్చింది. విశాఖ మన్యంలో కాఫీ తోటల విస్తరణకు సంబంధించి ఐటీసీ పాడేరు ఐటీడీఏతో ఒప్పందం చేసుకుంది. గిరిజన మహిళల ఉత్పత్తులను గ్రామీణ ప్రాంతాల్లో విక్రయం కోసం ఫ్రాంటీయర్ మార్కెటింగ్ , ఈజీ మార్ట్ లు ప్రభుత్వంతో ఒప్పందాన్ని చేసుకున్నాయి. అయితే ఈ ఒప్పందాలన్నీ అరకు కాఫీ చుట్టూ జరగడం విశేషం. ఇప్పటికే జాతీయ స్థాయిలో సైతం అరకు కాఫీకి గుర్తింపు లభించింది. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో కూడా కాఫీ చర్చనీయాంశం అయింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కాఫీ సాగు విస్తారంగా సాగుతోంది. ముఖ్యంగా పాడేరు ఏజెన్సీలో 11మండలాల్లోని 2.58 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీనిపై ప్రత్యక్షంగా 2.46 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పటికే అరకు కాఫీకి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. ఏకంగా పార్లమెంటులోనూ అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు తాజాగా అంతర్జాతీయ స్థాయిలో అరకు కాఫీ దూసుకెళ్లేలా ప్రైవేటు సంస్థలతో ఒప్పందాలు జరగడం విశేషం. సదరు సంస్థలు అనుకున్న స్థాయిలో అరకు కాఫీని ప్రమోట్ చేయగలిగితే.. అరకు కాఫీ అంతర్జాతీయంగా దూసుకెళ్లడం ఖాయం.

## పాఠశాల ఇలా.. పాఠాలు బోధించేది ఎలా..!



కృష్ణ: పాఠశాల నుంచే ఉత్తమ పౌరులు.. సమాజాన్ని బాగు చేసే ఉత్తమ విద్యార్థులు తయారవుతారు. పాఠశాలల్లో మౌలిక వసతులు ఎంత మెరుగ్గా ఉంటే విద్యార్థులను అంత ఉన్నతంగా తీర్చదిద్దగలిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

కానీ కృష్ణ మండలం గురజాల ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉంది. ఇక్కడ సుమారు 60 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల శిథిలావస్థకు చేరడంతో చినుకు పడితే చాలు పాఠశాల చిత్తడిగా మారుతుంది. పాఠశాల బిల్డింగ్ పై కప్పు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో పాఠశాల నిర్వహణ ఉందని హెచ్ఎం గంగాధర్ దిశతో చెప్పారు. ప్రాణభయంతో పాఠశాల నిర్వహణ కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# చంద్రబాబు బొమ్మే.. ఐడెంటిటీనా..?



విజయవాడ, : నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు 95 సీఎం అంటూ దూసుకుపోతున్నారు. గత మూడు పర్యాయాలకు భిన్నంగా వ్యవహరిస్తూ, వినూత్న రాజకీయాన్ని ఆవిష్కరిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం, పెట్టుబడులను ఆకర్షించి కొత్త ఉద్యోగాలు సృష్టించడం అన్న లక్ష్యాలతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారు. గడిచిన 14 నెలలుగా పాలనలో సంస్కరణలు తీసుకువచ్చిన చంద్రబాబు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టానని అంటున్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాలకు డబ్బు కేటాయించి వైసీపీ విమర్శలు తిప్పికొడుతున్నారు. తన పనితీరుతో అందరితో శభాష్ అనిపించుకోవాలని తాపత్రయపడుతున్న సీఎం.. సొంత కేడర్ నుంచి ఎదురవుతున్న విమర్శల నుంచి తప్పించుకోలేకపోతున్నారని అంటున్నారు. ఏడాది క్రితం 4.వా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబుపై విపక్షం కన్నా ఎక్కువగా స్వపక్షమే విమర్శలు గుప్పిస్తోంది. 95 సీఎం అంటూ వేగంగా అడుగులు వేస్తున్న చంద్రబాబు.. కార్యకర్తలను సంతృప్తి పరిచే నిర్ణయాలు తీసుకోవడంలో ఎడతెగని జాప్యం చేస్తున్నారని విమర్శలు ఎదుర్కొంటున్నారు. దీనికి టీడీపీ సోషల్ మీడియా వేదికలనే ఉదాహరణగా చెబుతున్నారు. రాజకీయ నిర్ణయాలు తీసుకోవడంలో చంద్రబాబు నాన్చుడు ధోరణిపై సోషల్ మీడియా సైనికులు అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి మండిపడుతున్నారు. అయితే సోషల్ సైనికులు ఒత్తిడికి తలొగ్గి తొందరపాటు నిర్ణయాలు తీసుకోలేమని పార్టీ పెద్దలు తొలుత చెప్పుకొచ్చారు. సొంత వారి విమర్శల నుంచి చంద్రబాబును రక్షించే ప్రయత్నం చేశారు. అయితే ఏడాది అయినా ఈ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో సోషల్ మీడియా శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు అధికార చట్రంలో బంధీ మరోవైపు తాను పూర్తిగా మారిపోయినట్లు చెప్పుకుంటున్న సీఎం చంద్రబాబు.. మళ్లీ అధికారుల చట్రబంధంలోకి క్రమంగా ఇరుక్కుంటున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పార్టీ కార్యకర్తలకు చంద్రబాబుకు మధ్య యథావిధిగా గ్యాప్ వచ్చేస్తోందని అంటున్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా కార్యకర్తలకన్నా అధికార యంత్రాంగానికి ఎక్కువ విలువనివ్వడం వల్ల రాజకీయంగా నష్టపోతున్నామని వ్యాఖ్యలు ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తున్నాయని చెబుతున్నారు. గత 14 నెలలో సీఎం ఎక్కువగా అధికార కార్యక్రమాలకే ప్రాధాన్యమిస్తున్నారని, కార్యకర్తల సాధకబాధలు తెలుసుకోడానికి అసలు సమయం కేటాయించడం లేదని విమర్శలు ఎక్కువవుతున్నాయి. తాను పూర్తిస్థాయిలో పనిచేస్తున్నా, మంత్రులు, ఎమ్మెల్యేలు సరిగా పనిచేయడం లేదన్న చంద్రబాబు వ్యాఖ్యలపైనా నిరసన వ్యక్తమవుతోందని అంటున్నారు. చంద్రబాబు సీఎంగా వ్యవహరిస్తున్నారే కానీ, పార్టీ అధినేతగా తమ సమస్యలు తెలుసుకోవడం లేదని ఎమ్మెల్యేలు, మంత్రులు అంతర్గత సంభాషణల్లో వాపోతున్నారని చెబుతున్నారు. వచ్చేఎన్నికల నాటికి పేదరికం అంతం చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న చంద్రబాబు నియోజకవర్గాల్లో తమ పరిస్థితిని అర్థం చేసుకోకుండా టార్గెట్లు పెట్టడంపైనా ఎమ్మెల్యేలు, మంత్రులు లబోదిబోమంటున్నారని అంటున్నారు. అందుబాటులో లేని అధినేత ఈ సారి పాలనలో తనలో పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిని చూస్తారని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విషయంపైనా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. గతంలో ఓ సారి మంత్రి, ఎమ్మెల్యేలతో డిన్నర్ భేటీలు నిర్వహిస్తానని చెప్పిన చంద్రబాబు.. ఒకరోజు మాత్రమే ఆ పనిచేశారని అంటున్నారు. నిత్యం బిజీ షెడ్యూలుతో సీఎం ఉండటం వల్ల పార్టీ పరమైన సమస్యలు, రాజకీయ నిర్ణయాల విషయంలో ఆయనను సంప్రదించడం కుదరడం లేదని అంటున్నారు. పార్టీ పరంగా మంత్రి లోకేశ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా అందుబాటులో ఉంటున్నా, చంద్రబాబు దృష్టికి తేకుండా ఏ నిర్ణయం తీసుకోలేని వాతావరణం ఉండటం కూడా నియోజకవర్గాల్లో ఇబ్బందులు సృష్టిస్తోందని ఎమ్మెల్యేలు వాపోతున్నారు. దీంతో చంద్రబాబు ఎప్పటిలా వన్ వేలో ప్రయాణిస్తూ తమను వెనక్కి వదిలేస్తున్నారని టీడీపీ ప్రజాప్రతినిధులు లబోదిబోమంటున్నారు.

## పామాయిల్ మొక్కలు నాటిన మంత్రి శ్రీధర్ బాబు

జయశంకర్ భూపాలపల్లి: జిల్లాలోని కాటారం మండలం ధన్వాడ గ్రామంలో రాష్ట్ర ఐటీ శాఖ, పరిశ్రమల మాత్యులు శ దుద్దిల్ల శ్రీధర్ బాబు మెగా ఆయిల్ ప్లాంటేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి, ఏ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో, తన సొంత వ్యవసాయ క్షేత్రంలో 11 ఎకరాలలో ఆయిల్ పామ్ పంటని మొదటగా మొక్క నాటి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంలో గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగం పట్ల చాలా రకమైనటువంటి చిత్తశుద్ధితో ముందుకు వెళుతుందని, రైతులకి ఆర్థికంగా ఎదిగే అవకాశాలను చాలా వరకు కల్పిస్తుందని, నీటి వసతి కలిగిన ప్రతి రైతు ప్రత్యామ్నాయ పంటల వైపుగా ఈ ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన తెలపడం జరిగింది. రైతులు ఈ ఆయిల్ పామ్ పంటలో అంతర పంటలుగా మిరప, పత్తి, మొక్కజొన్న మరియు ఇతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంది గనుక రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఈ పంటని ప్రోత్సాహాలు కల్పిస్తూ రైతులకి వెన్నదన్ను గా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్మన్, ఉద్యాన శాఖ అధికారి మని, మాజీ ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, పిఏసిఎస్ డైరెక్టర్ మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

# సినిమా..

## యాక్టింగ్‌లో ఆ ఇద్దరు మాస్టర్స్..!




షరతుల చిట్టా విప్పి సందీప్‌రెడ్డి వంగా ఆగ్రహానికి గురై 'స్పిరిట్' అవకాశాన్ని చేజార్చుకున్న బాలీవుడ్ భామ దీపికా పదుకొనే.. రీసెంట్‌గా అల్లుఅర్జున్, అట్లీ సినిమాకు సైన్‌చేసింది. దాంతో ఒకచోట పోగొట్టుకున్న అవకాశం మరోచోట దక్కినట్టయ్యింది ఈ అందాలభామకు.'కల్కి 2898ఏడీ'లో ప్రభాస్..అట్లీ సినిమాతో బన్నీ.. ప్రస్తుతానికి టాలీవుడ్‌కి చెందిన ఇద్దరు అగ్రహీరోలు కవర్ అయిపోయారు. అయితే.. దీపికా తీరు చూస్తుంటే వీరిద్దరితో ఆగేలా లేదు. టాలీవుడ్ అంతా కవర్ చేసేందుకు ప్రణాళికలే రచిస్తున్నట్టుంది ఈ బెంగళూరు భామ.

రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో 'నేను టాలీవుడ్‌లో మహేష్, తారక్‌ల అభిమానిని. వారిద్దరూ నటనలో మాస్టర్స్. వారితో కలిసి నటించాలనుంది.' అంటూ పేర్కొన్నది.


దీపికా నోటి వెంట మహేష్, తారక్‌ల ప్రస్తావన రావడం ప్రస్తుతం బాలీవుడ్‌లో చర్చనీయాంశమైం ది. గతంలో టాలీవుడ్‌లో మీకెవరు తెలుసు? అనడిగితే 'మహేష్' అని అదోలా నవ్వుతూ.. మిగతా హీరోలెవరూ తెలీనట్టు ప్రవర్తించిన దీపిక.. ఇప్పుడు టాలీవుడ్ హీరోలకు భజన చేయడం చూసి.. 'మార్పు మంచిదే' అంటూ వెటకారంగా కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు.

## రష్మీ ఎందుకు ఇంత కఠిన నిర్ణయం తీసుకుంది...!




జబర్దస్త్ హాట్ యాంకర్ రష్మీ గౌతమ్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందం, అభినయం ఉన్న ఈ భామ.. హీరోయిన్ మెటీరియల్ అయినా కూడా ఛాన్స్ లు మాత్రం దక్కడం లేదు. అయినా కూడా అడపాదడపా హీరోయిన్ గా కనిపిస్తూనే ఉంది. జబర్దస్త్ నుంచి వెండితెరకు వచ్చిన అనసూయ.. ప్రస్తుతం ఎంత బిజీగా మారిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ, రష్మీ మాత్రం జబర్దస్త్ ను వదలకుండా యాంకర్ గా కొనసాగుతూనే సినిమాల్లో కూడా బిజీగా మారింది. ఇక నిత్యం రష్మీ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూనే ఉంటుంది. ముఖ్యంగా జంతు ప్రేమికురాలు అయినా రష్మీ.. వాటికి ఏదైనా అయితే మాత్రం అస్సలు తట్టుకోలేదు. వా టిని సంరక్షించాలని కోరుతూ ఉంటుంది. మూగ జీవాలు అంటే ఆమెకు ప్రాణం. అయితే ఈమధ్యనే రష్మీకి సర్జరీ జరిగిన విషయం తెల్సిందే. దానివలన ఆమె కొన్నిరోజులు వృత్తికి దూరమయ్యినట్లు కూడాతెలిపింది. అయితే తాజాగా రష్మీ మరో కఠిన నిర్ణయాన్ని తీసు కుంది. వృత్తితో పాటు సోషల్ మీడియాకు కూడా ఆమె ఒక నెలరోజులు దూరంగా ఉండనున్నట్లు తెలిపింది. 'హలో అందరికీ నెల రోజుల పాటు అవసరమైన డిజిటల్ డిటాక్స్ తీసుకుంటున్నా ను. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా కొన్ని అవరోధాలను ఎదుర్కొం టున్నాను. నేను మీ అందరికీ మాట ఇస్తున్నాను. కచ్చితంగా నేను ధృడంగా తిరిగివస్తాను. నేను నా శక్తిని పునరుద్ధరించుకోవాలి. నన్ను నేను మెరుగుపరుచు కోవాలి. నాకు ఏది కావాలి.. ఎలాంటివి కావాలని నా ఆత్మా పరిశీలన చేసుకోవద్దని సమయం పడుతుంది. అందరూ నేను బలంగా ఉ న్నానని అనుకుంటారు. కానీ, నేను కూడా చాలా కృంగిపోయాను. వాటన్నింటిని సరిదిద్దుకోవాలి. నేను ఉన్నా లేకున్నా మీ ప్రేమ నాపై ఎల్లప్పుడూ ఉంటుందని ఆశిస్తు న్నాను' అంటూ రాసుకొచ్చింది. అం తేకాకుండా ఏదీశాశ్వతం కాదు. ఈ కాలం గడిచిపోతుంది' అంటూ చెప్పుకొచ్చింది. రష్మీ పోస్ట్ వెనుక ఆంతర్యం ఏంటి.. ? నిజంగానే డీటాక్స్ కోసం ఈ నిర్ణయం తీసుకుందా.. ? లేక వేరే ఏదైనా కారణమా అనేది తెలియాల్సి ఉంది. ఇక ఈ పోస్ట్ చూసిన అభిమానులు ఎందుకు ఇంత కఠిన నిర్ణయం తీసుకున్నావ్ రష్మీ.. అన్ని సెట్ అవుతాయి. జాగ్ర త్తగా ఉండు అంటూ కామెంట్స్ పెడుతున్నారు. కొందరేమో జబర్దస్త్ నుంచి రష్మీ బయటకు వచ్చేసిందని, కొత్త ప్రాజెక్ట్ ఓకే చేయ డంతో దానికోసం ప్రిపేర్ అవుతుందని అంటున్నారు. మరి ఇందులో ఏది నిజమో అనేది తెలియాల్సి ఉంది.

## తమన్నా మరీ ఇంత బోల్డ్ గానా



బాలీవుడ్ లో స్పెషల్ సాంగ్స్ ట్రెండ్ మారింది. ఒకప్పుడు హిందీలో స్పెషల్ అంటే సన్ని లియోన్ అనేవారు. ఇప్పుడు మాత్రం సినిమాలో స్పెషల్ అంటే మిల్క్ బ్యూటీ తమన్నాను అప్రోచ్ అవుతున్నారు మేకర్స్. రెండేళ్లుగా బాలీవుడ్ ఒకటే కాదు సౌత్ లోనూ స్పెషల్ సాంగ్ అంటే మిల్క్ బ్యూటీకే ఓటేస్తున్నారు. తమన్నా ఆడిపాడిన పాటలకు సైతం ఆ రేంజ్ లోనే రెస్పాన్స్ వస్తోంది. అయితే తాజాగా ఆమె బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ సిరీస్ కోసం గఫూర్ అనే ప్రమోషనల్ సాంగ్ లో ఆడిపాడింది. ఈ పాటకు కూడా మంచి రీచ్ వస్తోంది. ఇందులో తమన్నా లుక్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తన లుక్స్ తో సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రస్తుతం ఈ పాట ట్రెండింగ్ లోనూ ఉంది. అయితే స్పెషల్ సాంగ్ అంటేనే ట్రెండీ ఔట్ ఫిట్, హాట్ లుక్స్ అన్న విషయం తెలిసిందే. కానీ ఈ పాటకు తమన్నా ఔట్ ఫిట్ ప్రస్తుతం కాంట్రవర్సీకి దారి తీస్తోంది. ఇందులో ఆమె డ్రెస్సింగ్ కాస్త హద్దు దాటినట్లు ఉందని ఫ్యాన్స్ అంటున్నారు. ఆమె నుంచి మరీ ఇలాంటి డ్రెస్సింగ్ సెన్స్ ఊహించలేదని, దీంతో సర్ ప్రైజ్ ఇచ్చారని, ఇది చూసి ఆశ్చర్యపోయినట్లు కామెంట్ చేస్తున్నారు. మరికొందరు ఇలాంటి ఔట్ ఫిట్ ధరించేందుకు డేరింగ్ చేసినందుకు మెచ్చుకుంటున్నారు. జెన్ జీ ట్రెండ్‌లను ప్రయత్నిస్తురని అంటున్నారు. ఈ పాటలో ఆమె కాన్ఫిడెంట్, డ్యాన్స్ స్టెప్పులు అందరి దృష్టిని ఆకర్షించాయి. అయితే ఇది ఈ రోజుల్లో సినిమాల్లో బోల్డ్ ఫ్యాషన్ ఎలా కీలక పోషిస్తుం దనే దాని గురించి చర్చలకు దారితీసింది. దీంతో ఇలాంటి బోల్డ్ పాట సినిమాలో అవసరం ఉండి ఆమె చేసిందా... లేదా ఇండస్ట్రీలో తన మనుగడ నిలదొక్కుకునేందుకు చేసిన ప్రయత్నమా అని ఆశ్చర్యపోతున్నారు. అయితే అందరు క్రిటిసైజ్ చేయడం లేదు. కొందరు ప్రశంసలు కురిపి స్తున్నారు కూడా. ఆమె నేచురల్ బ్యూటీనెస్, డేరింగ్ నెస్, కాన్ఫిడెన్స్, యూనిక్ స్టైల్ పట్ల తమన్నాను మెచ్చుకుంటున్నారు. హీరోయిన్లు తమ స్కిల్స్ చూపి ంచేందుకు ఎంత దూరం వెళ్లగలరో ఈ పాట చూపిం చింది. ఈ సింపుల్ ప్రమోషనల్ సాంగ్ ప్రస్తుతం సినిమా ట్రెండ్స్ ను మార్చేసింది. దీంతోపాటు గతంలో తమన్నా జైలర్ లో కావాలయ్య , హిందీ సినిమా స్త్రీ 2లో ఆజ్ కి రాత్, అచావ్ అనే పాటల్లో ఆడిపాడింది. ఈ పాటల్లన్నీ యూట్యూబ్ లో సూపర్ హిట్ అయ్యాయి.

## రాంచరణ్ నయా ప్లాన్..!



టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో పెద్ది సినిమా చేస్తున్నాడని తెలిసిందే. పాన్ ఇండియా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుం డగా.. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఏఆర్ రెహ మాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. కాగా పెద్ది సెట్స్‌పై ఉండగానే రాంచరణ్ నయా ప్లాన్‌కు సంబంధించిన న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఇంతకీ విషయమేం టంటే రాంచరణ్ ఇక బ్యాక్ టు బ్యాక్ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా ప్లాన్ చేసుకున్నాడట. ఇందులో భాగంగానే కేజీఎఫ్, సలార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో సినిమా చేసే అవకాశాలున్నాయని వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ లాంచ్ కంటే ముందు రాంచరణ్ చేతిలో చాలా సమయం ఉండనుండగా.. ఈ టైంలో పలువురు పాపులర్ డైరెక్టర్లతో కథా చర్చలు జరుపాలని నిర్ణయించుకున్నాడని ఫిలింనగర్ సర్కిల్‌లో న్యూస్ ఒకటి టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. అన్నీ అనుకున్నట్టు కుదిరితే రాంచరణ్ మరికొన్ని రోజుల్లో తన కొత్త ప్రాజెక్ట్‌పై ప్రకటన కూడా చేయ బోతున్నాడని జోరుగా టాక్ నడుస్తోంది.

రాంచరణ్ నటిస్తోన్న పెద్ది మార్చి 27న 2026న థి యేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీ విడు దలకు ముందే కొత్త సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేయాల నుకుంటున్నాడట రాంచరణ్. మరి ఇదే నిజమైతే రాంచరణ్ పెద్ది సినిమా అప్‌డేట్స్‌తోపాటు రానున్న రోజుల్లో కొత్త సినిమాలకు సంబంధించిన విషయాలను కూడా షేర్ చేసుకోబో తున్నాడన్నమాట. ఇక రాంచరణ్ అభిమానులకు పండగేనన్నమాట. రాంచరణ్ రంగస్థలం తర్వాత సుకుమార్‌తో మరో సినిమాకు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే.

## కొత్తగా తల్లి అయిన వారికి తక్కువ పని గంటలుండాలి : విద్యాబాలన్



సినీ పరిశ్రమలో పని గంటలపై జరుగుతున్న చర్చ ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రముఖ నటి విద్యాబాలన్ ఈ అంశంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యంగా.. ఇటీవల నటి దీపికా పదుకొనే, దర్శకుడు సందీప్ రెడ్డి వంగాల మధ్య 'స్పిరిట్' సి నిమా విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో, విద్యాబాలన్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తాజాగా 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విద్యాబాలన్ మాట్లాడుతూ.. పరిశ్రమలో కొత్తగా తల్లి అయిన హీరోయిన్‌లకు లేదా ఇతర రంగాలలో చేసే ఆడవారికి సౌకర్యవంతమైన, తక్కువ పని గంటలు ఉండాల్సిన అవసరం ఎంతో ఉ ంది.దీనివలన తల్లి బిడ్డతో గడపడంతో పాటు తనను తాను మేనేజ్ చేసు కుంటుందని విద్యా చెప్పుకొచ్చింది. అలాగే ఇటీవల పరిశ్రమలో తక్కువ పనిగంటలు.అనుకూలమైన వర్కింగ్ అవర్స్ కావాలని కోరుతున్నారు. ఇది కూడా సరైనదే అని అనుకుంటున్నాను. అయితే ఎవిషయంలో నేను చేసే సినిమాలకు, ఎనిమిది గంటలు మాత్రమే షూట్ చేయలేము.

## పవన్ సినిమాలో రాశీ ఖన్నా..



టాలీవుడ్‌లో దశాబ్దకాలంగా తనదైన ముద్ర వేసుకున్న కథా నాయిక రాశీ ఖన్నాకు ఎట్టకేలకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన నటించే అవకాశం దక్కించుకుంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఈ సినిమాలో ఇప్పటికే శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా.. మరో కథానాయికగా రాశీ ఖన్నా ఎంపికైనట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సినిమాలో శ్లోక అనే పాత్రలో కనిపించబో తుంది రాశీ. ఈ సందర్భంగా రాశీ ఫొటోను చిత్రయూనిట్ పంచుకుంది. మరో వైపు ఇప్పటికే రాశీ షూటింగ్ సెట్‌లో అడుగు పెట్టి, పవన్ కళ్యాణ్‌తో కలిసి కీలక సన్నివేశాల్లో పాల్గొంటున్నారని సమా చారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ శరవే గంగా జరుగుతోంది. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కళ్యాణ్–హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై భారీ అంచనాలు నెలకొన్నా యి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేనివై. రవి శంకర్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

Published & Owned by Mamidi Somaiah, H.No.3- 2-92/27 to 276/506, Rock Town Colony, LB Nagar, Hyd, Rangareddy, Telangana- 500068. Printed at Ellora Printers, LN Nagar, Industrial Estate, Uppal, Rangareddy, Telangana. Editor- Mamidi Somaiah. Ph No. 9 00933723. RNI No. TEL TEL . 12/48343